నేటి కందం- నేటికి అందం

దసరా పర్వ దినంబున
పసగలిగిన పద్యమున శుభాశయ చయమున్
రసవిదులగు తమ కొసగెద
వసివాడని కుసుమమువలె వసుధ చరింపన్

(12-10-24 దసరా పండుగ)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చెడుపైనా మంచి గెలిచి
సాధించిన విజయ కీర్తి
సంప్రదాయ విజయదశమి
చాటే మనకు గొప్ప స్ఫూర్తి
సమాజంలో రాక్షసత్వ
చర్యలపై తిరుగుబాటు
జనం దీన్ని గ్రహిస్తేనే
చైతన్యపు సాగుబాటు

చురక



-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 12-10-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:61 పేజీలు:6 వెల: రూ.1/-







# గురుకుల భవన నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ

**పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం**
**ఇందిరమ్మ కలలుగన్న రాజ్య స్థాపనకు అడుగులు**
**150 కోట్లతో అధునాత స్కూల్ బిల్డింగ్స్ నిర్మాణం**
**శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ వెల్లడి**
**ఒకే రోజు 28 చోట్ల భూమి పూజ మహోత్సవం**
**సమీకృత గురుకులాల నిర్మాణలకు శంకుస్థాపన**
**షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గులో సీఎం రేవంత్**
**లక్ష్మీపురంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**
**పొన్నెకల్లులో మంత్రి పొంగులేటి..**
**నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి**
**హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ భూమి పూజ**



హైదరాబాద్, అక్టోబర్ 11 : పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో కూడిన విద్యను అందించాలన్న లక్ష్యంతో సమీకృత గురుకులాల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలిదశలో 28 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తీసుకురావాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న గురుకులాలను కొనసాగిస్తూనే.. అత్యాధునిక వసతులతో సమీకృత భవనాలను నిర్మించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్లగొండ, హుజూర్ నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, అందోల్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, షాద్‌నగర్, జడ్చర్ల, పరకాల, నారాయణఖేడ్, దేవరకద్ర, నాగర్‌కర్నూలు, మానకొండూరు, నర్సంపేటలో సమీకృత భవనాలను నిర్మించనుంది. ఇక ఈ 28 ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు శుక్రవారం భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు.

### కొందుర్గులో సీఎం రేవంత్ రెడ్డి..

షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమిలేదని విమర్శించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు 10,006 పోస్టులు డీఎస్సీ ద్వారా ఇచ్చామని చెప్పారు. ఉపాధ్యాయుల బదిలీలతో పాటు ఉద్యోగ ఉన్నతి ఇందిరమ్మ ప్రభుత్వం కల్పించిందని, గత ప్రభుత్వం అనేక స్కూల్స్ పెట్టిందే తప్ప పక్క వసతి కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు.

### 150 కోట్లతో అధునాతమైన పాఠశాలలు..

ఇందిరమ్మ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా అంతర్జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని సీఎం రేవంత్ అన్నారు. రాష్ట్రంలో ఒక్కో నియోజకవర్గంలో 125 నుంచి 150 కోట్లతో అద్భుతమైన పాఠశాల భవనాలను నిర్మాణం చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ప్రజల నెత్తిన భారం మోపిందని సీఎం ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 300 కోట్లతో అనేక కంపెనీలతో స్కిల్ డవలప్ మెంట్ నైపుణ్యం పెంపొందించే అవకాశం కలిపించిందన్నారు. మాటలతో కాదు ఇందిరమ్మ ప్రభుత్వం చేతలతో చేసి చూపిస్తుందని.. ప్రైవేటుకు దీటుగా పేద విద్యలకు కార్పొరేట్ విద్యానందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

### నూతన భవనాల్లో సకల సౌకర్యాలు

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మోడల్‌ను ఇప్పటికే ఖరారు చేశామని సీఎం రేవంత్ అన్నారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, తరగతి గదులు, ప్రయోగశాలలు, ఆట స్థలం, బాలబాలికలకు వేర్వేరు హాస్టళ్లు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ సిబ్బందికి నివాస సముదాయాలు ఏర్పాటు చేసేలా నమూనా రూపొందించామన్నారు. తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, యాంప్ థియేటర్ వంటి అధునాత సౌకర్యాలు కల్పిస్తామ న్నారు. విద్యార్థుల మానసిక ఉల్లాసం కోసం క్రికెట్ గ్రౌండ్, ఫుట్‌బాల్ కోర్టు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్ కోర్టులతోపాటు ఔట్‌డోర్ జిమ్, ఓపెన్ ఎయిర్ థియేటర్ ఏర్పాటు చేయనున్నట్టు సీఎం తెలిపారు.

### లక్ష్మీపురంలో భట్టి విక్రమార్క..

మధిర నియోజకవర్గం బోనకల్ లక్ష్మీపురం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికీ ప్రయోజనకరంగా ఉండే విధంగా ఒకే చోట అన్ని రకాల విద్యను అందించడమే ఈ గురుకులాల లక్ష్యం అన్నారు. పేదలకు ఈ స్కూల్స్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

### పొన్నెకల్లులో మంత్రి పొంగులేటి..

రాష్ట్ర వ్యాప్తంగా 28 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కి శంకుస్థాపన చేసుకుంటున్నామని, పేదల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, విద్య వైద్యానికి ఇందిరమ్మ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం, పొన్నెకల్‌లో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అమ్మ ఆదర్శ పథకంతో ?657 కోట్లతో ప్రభుత్వం వచ్చిన మూడునెల్లోనే చేపట్టి సౌకర్యాలు కల్పించిందని చెప్పారు.

### నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి..

నల్లగొండలో ఇంటిగ్రేటెడ్ స్కూ?ల్ భవనానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్?రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో ప్రతి విద్యార్థికి విద్య అందిస్తామని చెప్పారు. ప్రైవేటు స్కూళ్లు మూతపడేలా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

### హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం..

అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ హుస్నాబాద్ రావడంతో నియోజకవర్గం విద్యా రంగంలో మరింత ముందుకు పోతుందని, తన నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలంలో తంగలపల్లి గ్రామంలో రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్‌కు భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి నాయకుడిగా మీ అందరి ఆశీర్వాదంతో హుస్నాబాద్ ఎమ్మెల్యే అయి మంత్రి అయ్యానన్నారు.. నాలుగు గురుకులాలు ఒకే కాంప్లెక్స్‌గా విద్యను అంతర్జాతీయ స్థాయిలో తీసుకుపోవడానికి ఏర్పాటు చేస్తున్నామన్నారు..నాలుగో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడే చదువుకునేలా భవనాల నిర్మాణం జరుగుతుందని చెప్పారు.

# యుద్ధాలతో తీవ్ర నష్టాలు- నరేంద్ర మోడీ

**-లావోస్ ఈస్ట్ అసియా సమ్మిట్‌లో ప్రధాని మోదీ**
**-ఈ యుద్దాలతో నష్టపోతున్నది సౌత్ దేశాలే**
**-ఉగ్రవాదంతోనూ శాంతికి పెను ప్రమాదం**
**-కలిసికట్టుగా ఎదుర్కొంటేనే మానవళికి మనుగడ**

న్యూఢిల్లీ, అక్టోబర్ 11 : ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణలు గ్లోబల్ సౌత్ దేశాలపై అత్యంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని ప్రధాని




మోదీ పేర్కొన్నారు. లావోస్‌లోని 19వ ఈస్ట్ ఆసియా సమ్మిట్‌లో శుక్రవారం ప్రసంగిస్తూ.. తాను బుద్ధుడి బోధనలను అనుసరించే దేశం నుంచి వచ్చానని పేర్కొన్నారు. ఇది యుద్ధాల యుగం కాదని.. యుద్ధంతో సమస్యలకు పరిష్కారాలు లభించవు అని అన్నారు.

ప్రపంచ శాంతికి ఉగ్రవాదంతో ముప్పు..

ప్రపంచ శాంతిభద్రతకు ఉగ్రవాదం సైతం తీవ్రమైన సవాలుగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. దీన్ని ఎదుర్కొనేందుకు మానవత్వంపై విశ్వాసమున్న శక్తులన్నీ కలసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా సైబర్, సముద్ర, అంతరిక్ష రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని కోరారు. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, అంతర్జాతీయ చట్టాలను అందరూ గౌరవించాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి చర్చలకు, దౌత్యానికి ప్రాధాన్యమివ్వాలని మోదీ అభిలంషించారు. యురేషియా, పశ్చిమాసియాల్లో శాంతి స్థిరత్వం పునరుద్ధరించాలని పేర్కొన్నారు. ఐక్య రాజ్యసమితి చట్టాలకు లోబడి సముద్ర కార్యకలాపాలు జరగాలని ఈ సదస్సులో మోదీ స్పష్టం చేశారు. ఈ సదస్సులో ముందుగా ఇటీవల వియత్నాంలో యాగి తుపాను కారణంగా మరణించినవారికి సంతాపం ప్రకటించారు.

# నాణ్యమైన విద్యను అందించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ : మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ , అక్టోబర్ 11 : కోటీశ్వరుల పిల్లల మాదిరిగానే పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలనుకట్టిస్తున్నదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ అన్నారు. శుక్రవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న గంధంవారి గూడెం వద్ద రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడె న్షియల్ పాఠశాల పైలాన్ ఆవిష్కరించి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంగ్లీష్ , తెలుగు మీడియంలలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలల్లో ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీ పిల్లలందరూ కులమతాలకు అతీతంగా చదువుకోవచ్చని తెలిపారు.

ఈ పాఠశాలల్లో చదువుతోపాటు ,అన్ని వసతులు ఉంటాయని, ప్లే గ్రౌండ్స్ ఏర్పాటు చేస్తున్నామని, క్రీడల వల్ల మానసికంగా విద్యార్థులు ఎదుగుతారని చెప్పారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల శంకుస్థాపనతో తెలంగాణకు ఒక రోజు ముందుగానే దసరా పండుగ వచ్చిందని అన్నారు. 5000 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్రంలోని 28 నియోజకవర్గాలలో మొదటి విడతన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సిల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

# దసరా పండుగను ఘనంగా జరుపుకోవాలి

**-తెలంగాణ ప్రజలకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్..**

హైదరాబాద్ అక్టోబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ ప్రజలకు దసరా (విజయదశమి) పండుగ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ ప్రజలు అత్యంత వైభవంగా జరువుకునే పండుగ దసరా అని, విజయానికి సంకేతంగా భావించే దసరా పండుగను ప్రజల సంతోశంగా, ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు..

# ఐఏఎస్, ఐపిఎస్‌ల కేడర్ విభజనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

**-ఐఏఎస్ లు: వాణిప్రసాద్, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, ఆమ్రాపాలి, మల్లెల ప్రశాంతి**
**-ఐపిఎస్‌లు: అంజనీకుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతిని ఏపికి**



హైదరాబాద్ అక్టోబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఐఏఎస్, ఐపిఎస్‌ల కేడర్ విభజనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పదమూడు మంది అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చిన కేంద్రం గతంలో కేటాయించిన రాష్ట్రానికే వెళ్లాలని స్పష్టం చేసింది. తెలంగాణలో ఉన్న ఐఏఎస్ అధికారులు వాణిప్రసాద్, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, ఆమ్రాపాలి, మల్లెల ప్రశాంతిలతో పాటు ఐపిఎస్‌లు అంజనీకుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతిని ఎపికి వెళ్లాలని డిఓపిటి ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఐఏఎస్‌లు అనంతరాము, ఎస్ఎస్ రావత్, ఎల్.శివశంకర్, సృజన, హరికిరణ్‌లు తెలంగాణలో ఈనెల 16లోగా రిపోర్టు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది.

### 2016లో ఐఏఎస్, ఐపిఎస్‌లకు అనుకూలంగా క్యాట్ తీర్పు

ఉమ్మడి రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపిఎస్‌లను 2014లో తెలంగాణ, ఎపి మధ్య విభజిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ఐఏఎస్ అధికారులు సోమేష్ కుమార్, వాణిప్రసాద్, రొనాల్ రోస్, వాకాటి కరుణ, ఆమ్రపాలి, ప్రశాంతిలతో పాటు ఐపిఎస్‌లు అంజనీకుమార్, సంతోష్ మెహ్రా, అభిలాష బిస్త్, అభిషేక్ మొహంతిలను ఎపికి కేటాయించగా తెలంగాణకు ఐఏఎస్ అధికారులైన అనంతరాము, సృజన గుమ్మిళ్ల, ఎస్ఎస్ రావత్, ఎల్.శివశంకర్, సి.హరి కిరణ్‌లతో పాటు ఐపిఎస్ అధికారి ఏవి రంగనాథ్‌లను తెలంగాణను కేటాయించారు. ఈ నేపథ్యంలోనే కొందరు ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు విభజన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ 2014లో క్యాట్‌ను ఆశ్రయించారు. ఆ తర్వాత రంగనాథ్, సంతోష్ మెహ్రా తమ పిటిషన్‌లను వెనక్కి తీసుకున్నారు. మిగతా పిటిషన్‌లపై విచారణ జరిపిన క్యాట్ 2016లో అధికారులకు అనుకూలంగా తీర్పు వెల్లడించింది.

### 2017లో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన డిఓపిటి

క్యాట్ తీర్పులను సవాల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం పరిధిలోని డిఓపిటి 2017లో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. మొదట పిటిషన్లపై వేర్వేరుగా విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు సోమేష్ కుమార్ తెలంగాణ కేడర్‌ను రద్దు చేసి ఎపికి వెళ్లాలని గతేడాది జనవరిలో ఆదేశించింది.మిగతా పిటిషన్‌లను కలిపి విచారణ జరిపిన హైకోర్టు అధికారుల అభ్యర్థనలు, అభ్యంతరాలను మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఈ ఏడాది మార్చిలో తీర్పు వెల్లడించింది.

### ఐఏఎస్, ఐపిఎస్‌ల అభ్యర్థనలు, వాదనల పరిశీలన

హైకోర్టు ఆదేశాల మేరకు కేడర్ కేటాయింపుల పునఃపరిశీలన కోసం డిఓపిటి మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి దీపక్ ఖండేకర్‌ను కేంద్రం నియమించింది. దీపక్ ఖండేకర్ ఏకసభ్య కమిటీ ఐఏఎస్, ఐపిఎస్‌ల అభ్యంతరాలు, అభ్యర్థనలు, వాదనలను పరిశీలించారు. అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చి గతంలో డిఓపిటి నిర్ణయమే సరైనదని దీపక్ ఖండేకర్ సిఫార్సు చేసింది. కమిటీ సిఫార్సుల మేరకు తాజాగా డిఓపిటి తాజాగా ఈ ఉత్తర్వులను జారీ చేశారు. ఐఏఎస్ అధికారులు వాణిప్రసాద్, రొనాల్ రోస్, వాకాటి కరుణ, ఆమ్రపాలి, ఎం.ప్రశాంతి ఐపిఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మొహంతి ఎపిలో చేరాలని ఆదేశించింది. ఐఏఎస్ అధికారులు అనంతరాము, ఎస్ఎస్ రావత్, ఎల్.శివశంకర్, శ్రీజన, హరికిరణ్ తెలంగాణలో ఈనెల 16లోగా చేరాలని ఆదేశించింది.

ఇప్పటికే తెలంగాణలో తగినంత మంది ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు లేక ఇబ్బందులు పడుతుండగా ఉన్న వాళ్లలో సీనియర్‌లను అక్కడకు పంపిస్తే పాలనలో ఇబ్బందులు ఎదురవుతాయని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా తెలిసింది. తెలంగాణలో ఐఏఎస్‌ల కేడర్ స్ట్రెంత్ 218 కాగా, ప్రస్తుతం 170 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఐఏఎస్‌ల్లో వాకాటి కరుణ (2004) బ్యాచ్ కాగా, రొనాల్డ్‌రాస్ (2006), వాణిప్రసాద్ (1995), ఆమ్రపాలి కాట (2010), ప్రశాంతి (2009), ఐపిఎస్‌ల్లో అంజన్‌కుమార్ (1990) బ్యాచ్ కాగా, అభిలాష బిస్త్ (1994), అభిషేక్ మహంతి (2011) బ్యాచ్‌కు చెందిన వారు. ప్రస్తుతం వీరంతా తెలంగాణలో కీలక పదవులను నిర్వహిస్తుండగా వీరు ఎపికి వెళ్లిపోతే వారి స్థానంలో ఎవరిని నియమిస్తారన్నది తెలియాల్సి ఉంది.

# హైదరాబాదీ క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు డీఎస్పీ పోస్టు



హైదరాబాద్, అక్టోబర్ 11 : హైదరాబాదీ, టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఆగస్టు నెలలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 78లో 600 చదరపు గజాల స్థలాన్ని సిరాజ్‌కు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

తాజాగా సిరాజ్‌కు డీఎస్పీ పోస్టు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ జితేందర్ సిరాజ్‌కు డీఎస్పీ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖకు సిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ క్రికెట్ భారత దేశానికి, మన తెలంగాణ రాష్ట్రానికి గొప్ప పేరు, గౌరవాన్ని తెచ్చాడంటూ మొహమ్మద్ సిరాజ్‌ను సీఎం అభినందించారు. టీ20 వరల్డ్ కప్‌ను గెలిచిన అనంతరం హైదరాబాద్‌కు చేరిన సిరాజ్ మంగళవారం ఉదయం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సిరాజ్‌ను సీఎం ఘనంగా సన్మానించారు. సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్‌లో తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నాడని, అందుకే ఈ రోజు అత్యున్నత స్థాయి క్రికెటర్లలో ఒకడిగా పేరు సంపాధించాడని సీఎం ప్రశంసించారు.

భారత ప్లేయర్‌గా ఏడేండ్లుగా సేవలు అందిస్తుండటమేకాక, ఐసీసీ టీ20 వరల్డ్ కప్ టీమిండియా గెలుపు బృందంలో సిరాజ్ ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో అడుగుపెట్టిన సిరాజ్‌కు హైదరాబాద్‌లో క్రికెట్ అభిమానులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సిరాజ్‌ను సన్మానించింది.

# టాటా ట్రస్ట్ ఛైర్మన్‌గా నోయెల్ టాటా నియామకం



న్యూఢిల్లీ అక్టోబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పారిశ్రామికవేత్త రతన్ నావల్ టాటా(86) పరమపదించడంతో ఆయన స్థానంలో టాటా ట్రస్ట్ కు ఆయన సవతి సోదరుడు నోయెల్ టాటా నియమితులయ్యారు. టాటా ట్రస్ట్ అనేది టాటా గ్రూప్ దాతృత్వ సంస్థ. నోయెల్ టాటా నియామకాన్ని టాటా ట్రస్ట్ శుక్రవారం ఉదయం ప్రకటించింది. నోయెల్ ప్రస్తుతం ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్ మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ సంస్థలకు ఛైర్మన్ గా ఉన్నారు. అంతేకాక ఆయన టాటా స్టీల్, టైటాన్ సంస్థలకు వైస్ ఛైర్మన్ గా కూడా ఉన్నారు. రతన్ టాటా, నోయెల్ కు మధ్య సంబంధాలు చాలా ఏళ్లుగా లేవనే చెప్పాలి. నోయెల్ నియామక ప్రకటన వచ్చేంత వరకు రతన్ టాటా వారసుడెవరన్నది సస్పెన్స్ గా ఉండింది. కానీ శుక్రవారం మధ్యాహ్నం ప్రకటన వచ్చాక అంతా స్పష్టమైపోయింది. ఇదిలావుండగా రోజువారీ కార్యకలాపాలు మాత్రం టాటా సన్స్ ఛైర్ పర్సన్ నటరాజన్ చంద్రశేఖరన్ నిర్వహణలోనే నడవనున్నాయి.

# పేలిన డీజిల్ ట్యాంకర్.. భారీగా ట్రాఫిక్ జామ్

నల్గొండ, అక్టోబర్ 11 : తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా చిట్యాలలో రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన లారీ డివైడర్ ను ఢీకొట్టింది.

దీంతో లారీపై ఉన్న డీజిల్ ట్యాంకర్ పేలి భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ బయటకు దూకి ప్రాణాలు కాపాడుకోగా.. లారీ పూర్తిగా దగ్ధమైంది.

ఈ ఘటనతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.

# జీవనశైలి మార్పులతో కీళ్ళనొప్పులకు ఉపశమనం !

కీళ్ళ వాపులు, మస్క్యులోస్కెలిటల్ రుగ్మతలకు సంబంధించిన వ్యాధులను ఆర్థరైటిస్ అంటాం. కీళ్ళవాపు వ్యాధితో కీళ్ళనొప్పులు, కదలికలు తగ్గడం, కీళ్ళు కదలకుండా దృఢంగా మారడం వంటి పలు సమస్యలు ఉత్పన్నం అవుతాయి. అన్ని వయస్సుల జనంలో కనిపించే ఆర్థరైటిస్ రోగ తీవ్రత, వాటిలో రకాన్ని బట్టి చికిత్స పద్ధతులు నిర్ణయించబడుతాయి. సర్వసాధారణ ఆర్థరైటిస్ రోగాలలో ఆస్టియోఆర్థరైటిస్, రిమటాయిడ్ ఆర్థరైటిస్, గౌట్ (వేళ్ళ దగ్గర పుండు), లూపస్ (చర్మవృక్క వికార రోగం) ముఖ్యమైనవి. కీళ్ళవాపు వ్యాధితో శరీర కదలికల్లో మార్పు, పనులు సక్రమంగా చేయలేక పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థుల్లో నడక, సైక్లింగ్, ఈత లాంటి భౌతిక క్రియలు కష్టమైనప్పటికీ, వాటితోనే కొంత ఉపశమనం కూడా కలుగుతుంది. శరీర బరువు తగ్గడంతో మోకాళ్లపై భారం తగ్గిపోయి కీళ్ళ నొప్పులు కూడా తగ్గుతాయి.

ప్రపంచ ఆర్థరైటిస్ దినం-2024 నినాదం:

రుమాటిక్ అండ్ మస్క్యులోస్కెలిటల్ వ్యాధుల (ఆర్థరైటిస్ వ్యాధుల) పట్ల ప్రజల్లో అవగాహన, జీవనశైలిలో మార్పులు, తొలి దశలోనే గుర్తించడం, కీళ్ళనొప్పులతో బాధపడే వారు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆర్థరైటిస్ రాకుండా

**(12 అక్టోబర్ "ప్రపంచ ఆర్థరైటిస్ దినం" సందర్భంగా)**

తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియచేయటానికి ప్రతియేటా 12 అక్టోబర్ రోజున 'ప్రపంచ కీళ్ళవాపు లేదా ఆర్థరైటిస్ దినం" జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. 1996లో అంతర్జాతీయ ఆర్థరైటిస్, రుమటిజమ్ సంస్థ నేతృత్వంలో ప్రపంచ ఆర్థరైటిస్ దినం ప్రవేశ పెట్టబడింది. ప్రపంచ ఆర్థరైటిస్ దినం-2024 నినాదంగా 'సమాచార ఎంపికతో మెరుగైన ఫలితాలు' అనే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. తొలి దశలో (12 వారాల లోపు) గుర్తించిన వారికి సులభంగా నియంత్రించబడే ఆర్థరైటిస్, ఆలస్యంగా గమనించిన వారిలో తీవ్ర వ్యాధిగా మారి శరీరక శ్రమ చేయలేకపోవడం, దినచర్యలో క్రియాశీలత క్షీణించడం లాంటి పరిణామాలకు దారితీస్తుంది. అనువంశికంగా కూడా సంక్రమించగల ఆర్థరైటిస్ వ్యాధి పొగ త్రాగడం, స్థూలకాయం, నిష్క్రియాత్మక జీవనశైలి, కీళ్ళ/కండరాలపై పని ఒత్తిడి, ప్రమాదాలు లాంటి కారణాలతో కీళ్ళ వాపు వ్యాధి తీవ్రత (ఆర్థరైటిస్) పెరుగుతుంది.

ప్రపంచ సమస్యగా ఆర్థరైటిస్:

ప్రపంచవ్యాప్తంగా 350 మిలియన్ల ప్రజలు ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. దాదాపు విశ్వ జనాభాలో ఒక శాతం ప్రజలు రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో సతమతం అవుతున్నారు. వయస్సు 60 ఏళ్ళు దాటిన మహిళల్లో 18 శాతం, పురుషుల్లో 10 శాతం ప్రజలు ఆస్టియోఆర్థరైటిస్‌తో బాధ పడుతున్నారు. ఇండియాలో 15 శాతం ప్రజలకు (180 మిలియన్లు) కీళ్ళవాపు సమస్యలు ఉన్నాయి. ఆరోగ్యకర జీవనశైలి (పొగ తాగక పోవడం, మానసిక ఒత్తిడి తగ్గించడం, చక్కగా నిద్ర పోవడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం), ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు (సమతుల పోషకాహారం, ఉప్పు మరియు చక్కెరను తగ్గించడం), వైద్యులు లేదా ఫిజియోథెరపిస్టు సూచనల మేరకు శారీరక శ్రమ (సైక్లింగ్, వాకింగ్, గార్డెనింగ్, స్విమ్మింగ్, యోగా వంటివి) పాటించడం ద్వారా ఆర్థరైటిస్ అదుపు చేయపడుతుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వయసుతో ప్రమేయం లేకుండా రావచ్చేమో కాని వయస్సుతో పాటు వచ్చే అవకాశం ఆస్టియోఆర్థరైటిస్‌కు ఉంటుంది. ఆస్టియోఆర్థరైటిస్ అదుపు చేయడానికి నీటిని ఎక్కువగా తాగడం(2 లీటర్ల కన్న ఎక్కువ), నూనెలు/కొవ్వులను తగ్గించడం, స్వీట్స్ మరియు సాఫ్ట్ డ్రింక్స్ తగ్గించడం, పోషకాహారం తీసుకోవడం, నిపుణుల సూచనలతో శారీరక వ్యాయామం చేయడం లాంటివి పాటించాలి.

రుమటాయిడ్ ఆర్థరైటిస్:

రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనబడే దీర్ఘకాలిక రుగ్మత కారణంగా చర్మం, కళ్ళు, ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలతో పాటు రోగనిరోధకశక్తిని ప్రభావితం చేస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ తీవ్రతతో ఎముకల క్షయం మరియు కీళ్ళ వైకల్యంతో పాటు వాపుతో తీవ్రమైన నొప్పి వస్తుంది. వయసు, లింగం, అనువంశికత, పొగ తాగడం, పర్యావరణ కాలుష్యం, అధిక బరువు కారణాలతో రుమటాయిడ్ ఆర్థరైటిస్ రావచ్చు. ఈ వ్యాధి ఫలితంగా పొడి కళ్ళు / నోరు, అసాధారణ శరీర కూర్పు, కీళ్ళ వాపు, కీళ్ళ దృఢత్వం తగ్గడం, మూత్రపిండాలు, లాలాజల గ్రంథులు, నరాల కణజాలం, ఎముకన మజ్జ, నోడ్యూల్స్, గుండె సమస్యలు, ఊపిరితిత్తుల జబ్బులు, కార్పాల్ టన్నెల్ సింద్రోమ్ రుగ్మతలు కలుగుతాయి. దీనిని తగ్గించడానికి వేడి లేదా చల్లని ప్యాక్స్, తగినంత విశ్రాంతి, వ్యాయామం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థులు ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, చేపలు, సోయా గింజలు, అవిసెలు, ఆక్రోట్లు, విటమిన్- ఏ, సి, ఈ కలిగిన ఆహారం, బెర్రీస్, చాక్లెట్స్, పాలకూర, బీన్స్, తాజా పండ్లు, అల్లం, ఫిష్ ఆయిల్, తాజా కూరగాయలు, ఫైబర్ ఫుడ్, బ్రోకోలీ, గ్రీన్ టీ, ద్రాక్ష లాంటి పోషకాహారం తీసుకోవాలి.

కీళ్ళ వాపు సమస్యలు రాకుండా ఉండేలా జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ, వైద్యుల సూచన మేరకు పోషకాహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థులు వైద్య నిపుణుల సూచనలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాధిని నియంత్రించాలి. చికిత్స కన్న నివారణే మిన్న అని ముందు జగ్రత్త పడుతూ, సంతోషదాయక జీవనయానం చేద్దాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## నేటి డిజిటల్ యువత అసాధ్యాలను సుసాధ్యాలు చేయాలి

**– లయన్ కెప్టెన్ డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 11 : యువశక్తికి చిరునామాగా నిలిచిన దేశ



యువత పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే అసాధ్యాలు సహితం సుసాధ్యాలు అవుతాయని రిటైర్డ్ ప్రిన్సిపల్, లీడ్ ఇండియా -2047 అధ్యక్షులు లయన్: కెప్టెన్: డా: బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం, బూరుగుమళ్ళ గ్రామంలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన ఆరుగురు యువతీయువకులకు ఘన సన్మానం చేసి మాట్లాడుతూ చదువులకు పేదరికం అడ్డుకాదని, ఎదగాలనే కసితో కృషి చేస్తే ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక సులభం అవుతుందని అన్నారు. కన్న తల్లితండ్రులు, గురువులను నమ్మిన యువత లక్ష్య సాధనలో సఫలం అవుతారని అంటూ, నేటి డిజిటల్ యువత నైపుణ్యాలకు పదును పట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. గత కొన్ని ఏండ్లుగా బూరుగుమళ్ళ గ్రామ యువత అధిక సంఖ్యలో ఉద్యోగాలకు ఎంపిక కావడం శుభ పరిణామమని, ఆఫీసర్ స్థాయి ఉద్యోగాల ఎంపిక విషయంలో శ్రద్ధ వహించాలని కోరారు. సమన్వయ కర్త మహెందర్ మాట్లాడుతూ మన గ్రామానికి సత్కీర్తిని తెచ్చిన యువత నేటి గ్రామ విద్యార్థినీవిద్యార్థులకు ప్రేరణగా నిలుస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ పౌరులు బొబ్బాల ప్రతాప రెడ్డి, శేషగిరి స్వామి తదితరులు ఉద్యోగాలకు ఎంపికైన యువతకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగాలు పొందిన గ్రామ యువతకు సన్మానం:

ఇటీవల వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందిన ఆరుగురు యువత జెల్ల శ్రీనాథ్ (పోలీసు శాఖ), పున్నం నవీన్ (ఫైర్ ఆఫీసర్), జోలెం నాగరాజు (టిజిటి టీచర్), గోరంట్ల కిషోర్ (అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్), ఓరుగంటి శ్రీకాంత్ (వ్యవసాయ అధికారి), బొమ్మినేని రవలి (ఎస్‌జిటి టీచర్)లకు లీడ్ ఇండియా, లయన్స్ ఇంటర్నేషనల్ పక్షాన తల్లితండ్రుల సమక్షంలో ఘనం సన్మానం చేశారు. ఈ పవిత్ర కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పౌరసమాజం అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగాలకు ఎంపికైన యువతకు అభినందనలు తెలిపారు.

## ఏపీలో మద్యం దుకాణాలకు విదేశాల నుంచి అప్లికేషన్స్..

అమరావతి అక్టోబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఏపీలో కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు నేటితో ముగియనున్నారు. దరఖాస్తుకు శుక్రవారం చివరిరోజు కావడంతో పెద్ద ఎత్తున ఆశావహులు దరఖాస్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,396 మద్యం దుకాణాల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. శుక్రవారం ఒకే రోజు 20వేల వరకు దరఖాస్తులు రావచ్చని అంచనా. దాంతో ప్రభుత్వానికి రూ.1600కోట్లకుపైగానే ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా, అల్లూరి జిల్లాలో అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి. నిన్నటి వరకు ఎన్టీఆర్ జిల్లాలో 113 మద్యం దుకాణాలకు 4,839 మంది.. అల్లూరి జిల్లాలో 40 మద్యం దుకాణాలకు 869 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.అయితే, అమెరికా, యూరప్ నుంచి సైతం పలువురు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మద్యం దుకాణాల కోసం శుక్రవారం రాత్రి 7 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. రిజిస్ట్రేషన్ అనంతరం 12 గంటలలోగా డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు డీడీలతో ఎక్సైజ్ స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యాలయాలకు వచ్చే వారంతా తప్పనిసరిగా సాయంత్రం 7లోగా చేరుకోవాలని.. టికెట్లు అందించి.. దరఖాస్తులను స్వీకరిస్తామని.. ఆ తర్వాత వచ్చే వారికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

## మెదక్ జిల్లాలో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

హైదరాబాద్, అక్టోబర్ 11 : దేవాలయాలలో దొంగతనాలు చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లాలోని నాగిరెడ్డి పేట్, హవేలీ ఘనపూర్, చిన్న శంకరంపేట్, చేగుంటలోని ఆలయాల్లో గత నెలలో నాలుగు దొంగతనాలు జరిగాయని చెప్పారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు వేగవంతం చేశామని, చిన్న శంకరం పేట (మం) గవ్వలపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కొందరు అనుమానస్పదంగా టాటామంజా కారులో తప్పించుకొనే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు.వారిని చాకచక్యంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. పట్టుబడిన ముఠాలో మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన అస్లాం, షేక్ ఇలియాస్, షేక్ సమీర్‌గా గుర్తించమని ఆ ముగ్గురు పాత నేరస్థులే



అని ఎస్పీ తెలిపారు. అంతరాష్ట ముఠా నుంచి మూడు సెల్ ఫోన్‌లు, ఒక కారు, ఐదు లక్షల 50 వేల రూపాయల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నమని ఎస్పీ వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దొంగల ముఠాను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందనందించారు.

## 93ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం-ఐదుగురు అరెస్ట్

తిరుపతి, అక్టోబర్ 11 : నెల్లూరు జిల్లా సోమశిల సమీపంలో 93ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని, ఐదుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమశిల-అనంత సాగరం మార్గంలో ఎర్రచందనం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐలు సురేష్ బాబు, టి.విష్ణు వర్ధన్ కుమార్




బృందాలు తనిఖీలు నిర్వహించారు. సోమశిల అనంత సాగరం మార్గంలో ఐదుగురు స్మగ్లర్లను పట్టుకున్నారు. నిందితుల్లో నలుగురు తమిళనాడు తిరువన్నామలై జిల్లా, ఒకరు పాండిచ్చేరి వాసిగా గుర్తించారు. వారి నుంచి 93ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఆపరేషన్ లో పాల్గొన్న సిబ్బందికి ఎస్పీ సుబ్బారాయుడు రివార్డులు ప్రకటించారు.

## దసరా పండగ సందర్భంగా వృద్ధులకు పేదలకు వస్త్రదానం



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 11 : (నేటినిజం ప్రతినిధి); దసరా పండగ సందర్భంగా శుక్రవారం వైపై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నందగిరి కృష్ణవేణి భాను శర్మ అందించిన దోవతులు శుక్రవారం రోజున పేదలకు వృద్ధులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అలాగే మొన్న జరిగిన సద్దుల బతుకమ్మ పండగను పురస్కరించు కుని పేదమహిళలకు కూడా చీరలపంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ట్రస్ట్ నిర్వాహకులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్ డాక్టర్ బెజ్జంకి రవీందర్ పొలాస రాజేందర్ చల్లా సత్తయ్య నక్క వేణు ఎండి మన్నాన్ తదితరులు పాల్గొన్నారు

## 1265 రోజులుగా పేదలకు అన్నదానం



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 11 : (నేటినిజం ప్రతినిధి): దాతల సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో 1265 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున లక్ష్మీగణపతి కాంప్లెక్స్ ముందు రాజన్న భీమేశ్వర ఆలయం వద్ద ఉన్న పేదలకు, అన్నార్తులకు అన్న దాన కార్యక్రమం, నందగిరి కృష్ణవేణి భాను శర్మ అందించిన దోవతులు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నదాతలుగాకూతురు పిట్టల నక్షత్ర పుట్టినరోజు సందర్భంగా పిట్టల రాజ్ కుమార్ పవిత్ర దంపతులు శాశ్వత దాతలుగా జువ్వాడి స్నేహలత వెంకటేశ్వర రావు దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవ రాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కుమారులు కోడళ్లు రామడుగు ప్రజ్ఞ శరత్ చంద్ర దంపతులు, రామడుగు శిరీష సాయి చంద్ర దంపతులు, రామడుగు శర్వాణి రవిచంద్ర దంపతులు ఉన్నారని, అన్నదానానికి శాశ్వత సభ్యత్వం పొందాలి అనుకునే దాతలు ట్రస్టు సభ్యులను గాని, ట్రస్టు ఫోన్ నం. 92469 39388 నంబరు ద్వారా సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మహేష్ కోరారు. అన్నదాన కార్యక్రమం లో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్ డాక్టర్. బెజ్జంకి రవీందర్, పొలాస రాజేందర్, చల్లా సత్తయ్య, నక్క వేణు తదితరులు పాల్గొన్నారు.

## మహానందిలో సీఐడీ డైరెక్టర్ ప్రత్యేక పూజలు..



అమరావతి, అక్టోబర్ 11: నంద్యాల జిల్లాలోని మహానంది పుణ్యక్షేత్రంలో సీఐడీ డైరెక్టర్ నగేష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ ఆనవాయితీ ప్రకారం యాగశాలలో అర్చకులు కండువా కప్పి స్వామివార్ల ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం చేశారు. ఆయన వెంట సీఐడీ ఎస్ ఐ భరత్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్ సుధీర్, రామిరెడ్డిలు వున్నారు.

## డీఎఫ్‌వో పై ఆరోపణలు- విచారణకు ఆదేశించిన పవన్

అమరావతి, అక్టోబర్ 11: కాకినాడ డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. కాకినాడ అటవీశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీంద్రనాథ్‌రెడ్డి మైనింగ్ వాహనాల విషయంలో కొన్ని రకాల ఆంక్షలు విధించారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఆయన పేషీలోని ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వారి పేర్లు చెప్పి మైనింగ్, అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు అభియోగాలున్నాయి. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎంకు పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పవన్ విచారణకు ఆదేశించారు.






## ఐదు నెలలుగా జీతాల్లేవ్..ఆందోళనబాట పట్టిన మిషన్ భగీరథ కార్మికులు

ధరూరు, అక్టోబర్ 11 : జీతాలు ఇవ్వకుంటే ఎలా పని చేయాలంటూ మిషన్ భగీరథ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం రేవులపల్లి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు సమీపంలో ఉన్న మిషన్ భగీరథ ప్రధాన వాటర్ ప్లాంట్ గేటు వద్ద నీటిశుద్ధి యంత్రాల ఆపరేటర్స్, లేబర్స్ ధర్నాకు దిగారు. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అసలే చాలీచాలని వేతనాలు.. ఆపై ఆలస్యం వస్తే తామ కుటుంబాలు ఎలా బతకాలన్నారు. వేతనాలు సార్ అని అడిగితే ఇష్టం ఉంటే పని చేయండి.. లేదంటే వెళ్లిపోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. దీంతో చేసేది లేక ఆందోళనకు దిగినట్లు తెలిపారు. మాకు ఉద్యోగ భద్రతతోపాటు వేతనాలు సకాలంలో చెల్లించేలా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# శ్రీవారి సేవలో వీవీఎస్ లక్ష్మణ్ కుటుంబం



తిరుపతి, అక్టోబర్ 11 : తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మహా రథోత్సవాన్ని నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తిరుమాడ వీధుల్లో విహరించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ ఆలయ పుష్పాలంకరణకు పుష్పాలను విరాళం అందజేశారు.

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి ఆలయానికి చేపట్టిన మూడో విడత పుష్పాలంకరణకు రూ. 15 లక్షల విలువైన పుష్పాలను అందించారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులకు ఈ విరాళాన్ని అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో 7వ రోజు 10 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 60 వేల కట్ ఫ్లవర్స్ తో పుష్పాలంకరణ జరగ్గా ఆలయంలోని ధ్వజస్తంభం, బలిపీఠం, ఆలయ ప్రాంగణాలకు పుష్పాలంకరణ చేసేందుకు ఫ్లవర్స్ ను మాజీ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ అందజేశారు.

# పేదల సొంతింటి కల నెరవేరుస్తాం..మంత్రి పార్థసారథి

**-ఇళ్లు లేని పేదలకు శాశ్వత గృహాలు**
**-వైసీపీ పాలనలో అన్నీ అవకతవకలే**
**-రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు**
**-ఇప్పుడిప్పుడే ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతోంది**
**-జర్నలిస్టులందరికీ మేలు చేస్తాం**
**-స్పష్టంచేసిన మంత్రి కొలుసు పార్థసారథి**

అమరావతి, అక్టోబర్ 11: రాష్ట్రంలో ఏ పేదవాడు కూడా నాకు ఇల్లు లేదు అనే మాట అనకుండా వచ్చే అయిదేళ్లలో నిరుపేదలు అందరికీ శాశ్వత గృహ వసతి కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్ధేశం చేశారని, ఆ లక్ష్య సాధన దిశగా గృహనిర్మాణ శాఖ ముందుకు



అడుగులు వేస్తున్నదని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్ మొదటి అంతస్తులో ఆధునీకరించిన తన చాంబర్‌లో శాస్త్రోత్తంగా శుక్రవారం ఆయన ప్రవేశించారు.

గత పాలనలో అన్నీ అవకతవకలే

ఎస్సీలకు, బీసీలకు మేమే చాంపియన్లు అని చెప్పుకునే గత పాలకుల హయాంలో గృహ నిర్మాణ శాఖలో ఎన్నో అవకతవకలు జరిగాయని, నిరుపేదల గృహ నిర్మాణాలకై కేంద్రం ఇచ్చిన దాదాపు రూ.4,500 కోట్ల నిధులను పక్కదోవ పట్టించి నిరుపేదలకు అన్యాయం జరిగిందన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక్కొక్క యూనిట్ కు రూ.2.50 లక్షల రుణ సహాయాన్ని అందజేస్తే, దాన్ని రూ.1.80 లక్షలకు తగ్గించడమే కాకుండా ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణానికై రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు అదనంగా అందజేసే ఆర్థిక సహాయాన్ని కూడా పూర్తిగా రద్దు చేసిన ఘనత గత ప్రభుత్వానిదే అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఎన్నో తప్పిదాలు జరిగాయని, రాష్ట్రాన్ని రూ.10.50 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి దింపడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకు వచ్చారన్నారు. రాష్ట్రంలో ఎటు వంటి ఆదాయ వనరులు, అభివృద్ధి లేకుండా చేశారని, గతంలో జరిగిన ఇటువంటి తప్పిదాలు అన్నింటినీ చక్కదిద్ది రాష్ట్రాన్ని ఒక గాడిలో పెట్టేందుకు తమ ప్రభుత్వం వంద రోజుల పాలనలో ముఖ్యమంత్రి ఎంతగానో కృషిచేశారని మంత్రి తెలిపారు. యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని, అభివృద్ధిని అందిపుచ్చుకునేలా యువతీ యువకులను సిద్ధం చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో స్కిల్ సెన్సెస్ ద్వారా ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. ప్రజలు కేవలం సంక్షేమ పథకాలపైనే ఆధారపడకుండా వారికి బంగారు భవిష్యత్తును ఏర్పాటుచేసే దిశగా కృషి జరుగుతోందని, 2029 నాటికి రాష్ట్ర జీడీపీ , ప్రతి పౌరుడి తలసరి ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలోనే కాకుండా, ఇంకా వారికి ఏ విధంగా మేలు చేకూర్చగలవెూ అనే కోణంలో ఆలోచించి ప్రతిపాదనలు రూపొందించాలని ఈ మధ్య జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లుగా తగు చర్యలు చేపట్టడం జరిగిందని మంత్రి తెలిపారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెపుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రకటనలు జారీలో ఇష్టానుసారంగా ప్రవర్తించడమే కాకుండా తమకు నచ్చిన పేపర్లకు పెద్ద ఎత్తున జారీచేస్తూ, నచ్చని పేపర్లు వాటంతట అవే విత్ డ్రా అయ్యే పరిస్థితులు కల్పించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయంలో రూ.200 -లు పత్రిక కొనుగోలుకు ఇస్తూ అనధికారికంగా పలానా పత్రికనే కొనుగోలు చేయాలని నిర్ధేశించినట్లు సమాచారం ఉందని, దానిపై విచారణ జరుగుతోందన్నారు. సంబంధిత జీవోను కూడా రద్దు చేశామన్నారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎం.డి. కె.రాజబాబు, సమాచార శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, సంయుక్త సంచాలకులు పి.కిరణ్ కుమార్ మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# శ్రీదేవి, భూదేవిలతో రథంపై తిరుమలేశుని కటాక్షం

తిరుపతి, అక్టోబర్ 11 : తిరుమల క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీవారి రథోత్సవం వైభవంగా సాగింది. ఆద్యాంతం భక్తుల జయజయధ్వానాల మధ్య రథోత్సవం కొనసాగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడైన మలయప్ప స్వామి రథంపై నుంచి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గోవింద నామస్మరణ చేస్తూ భక్తులు రథాన్నిలాగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తిరుమలకు భారీగా చేరుకోగా.. గ్యాలరీలు కిక్కిరిశాయి. .ఇక రాత్రి మలయప్పస్వామి అశ్వ వాహన సేవ ముగియనున్నది. అశ్వవాహనంపై అశ్వంపై కల్కి అవతారంలో భక్తులకు స్వామివారు అనుగ్రహించనున్నారు. ఈ అశ్వవాహన సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.




# దార్శనికత, అనుభవం, నిబద్ధతల అరుదైన కలయికే ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ: శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 11 : న్యూఢిల్లీలోని పీహెచ్ డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పిహెచ్ డీ సిసిఐ) 119వ వార్షిక సమావేశానికి కేంద్ర హోం, సహకార శాఖల ఓ మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది సమావేశపు ఇతివృత్తం 'వికసిత్ భారత్ ఏ 2047: ప్రగతి శిఖరం వైపు పయనం'. ఈ కార్యక్రమంలో పరిశ్రమల రంగానికి చెందిన దాదాపు 1500 మంది వ్యాపారవేత్తలు, చార్టర్డ్ అకౌంటెంట్లు, బ్యాంకర్లు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 9వ తేదీ రాత్రి మరణించిన ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ రతన్ టాటాకు నివాళులర్పిస్తూ కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా తన ప్రసంగాన్ని ప్రారంభించారు. శ్రీ రతన్ టాటా భారత పారిశ్రామిక రంగంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కూడా గౌరవనీయమైన వ్యక్తి అని అన్నారు. టాటా గ్రూప్‌లో పలు మార్పులు అవసరమైన సమయంలో ఆయన టాటా గ్రూప్ సారథిగా బాధ్యతలు స్వీకరించారని, ఎంతో ఓపికగా పని చేస్తూ సంస్థకు సంబంధించిన అన్ని వ్యాపారాల్లోను, పని పద్ధతుల్లోను మార్పులు తెచ్చారని శ్రీ అమిత్ షా అన్నారు. నేటికీ, భారతదేశ పారిశ్రామిక రంగంలో టాటా సంస్థ ఒక ధ్రువతారగా నిలుస్తోందని శ్రీ షా అన్నారు. శ్రీ రతన్ టాటా తన పారిశ్రామిక సంస్థలను దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కీలక స్థానానికి తీసుకుపోయారని అన్నారు. ఆయన నిజాయితీకి కట్టుబడి, అన్ని నియమ, నిబంధనలను అనుసరించారని శ్రీ అమిత్ షా ప్రశంసించారు. ట్రస్ట్ ద్వారా రతన్ టాటా దేశంలోని వివిధ సమస్యలను పరిష్కరిస్తూ, మెరుగైన సమాజ నిర్మాణానికి దోహదపడేలా కృషి చేశారని శ్రీ అమిత్ షా తెలిపారు. శ్రీ రతన్ టాటా వారసత్వం పారిశ్రామిక వేత్తలకు చిరకపాలం పాటు మార్గదర్శకంగా ఉంటుందని అన్నారు.

ఈ ఏడాది భారతదేశ పరిశ్రమలకు నిర్ణయాత్మకమైన సంవత్సరం కాబోతున్నదని, ఇలాంటి సమయంలోనే పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) 119వ వార్షిక సదస్సును నిర్వహిస్తున్నదని కేంద్ర హోంమంత్రి తెలిపారు. నేడు ప్రపంచ దేశాలలో విశ్వాస సంక్షోభం నెలకొందని ఆయన అన్నారు. శ్రీ నరేంద్ర మోదీ దేశానికి మొదట ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా గత 23 ఏళ్లుగా నిరంతరం ప్రజాస్వామ్యయుతంగా ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్నారని శ్రీ అమిత్ షా అన్నారు. స్థిరత్వం లేకుండా, విధానాలను సమర్థవంతంగా అమలు చేయలేమని, భద్రతకు, అభివృద్ధికి హామీ ఇవ్వలేమని అన్నారు. స్థిరత్వం అనేది విధానాలు, ఆలోచనలు, అభివృద్ధి కొనసాగింపునకు దోహదం చేస్తుందని ఆయన అన్నారు. గత పదేళ్లలో అనేక సమస్యల నుండి ఈ విశాలమైన దేశాన్ని ప్రధాని మోదీ రక్షించారని, ఇప్పుడు వరుసగా మూడోసారి ప్రధానిగా దేశానికి సారథ్యం వహిస్తున్నారని అన్నారు.

'వికసిత్ భారత్ ఏ 2047: ప్రగతి శిఖరం వైపు పయనం' అన్న ఇతివృత్తం చాలా సముచితంగా ఉందని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ప్రధాని శ్రీ మోదీ మన ముందు రెండు ప్రధాన లక్ష్యాలను ఉంచారని, 2047 నాటి స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి, భారతదేశం పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మారాలని, 2027 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనేది – ఆ రెండు ప్రధాన లక్ష్యాలని వివరించారు. ఈ రెండు లక్ష్యాలను సాధించేందుకు ప్రధాని మోదీ గత పదేళ్లుగా వివిధ విధానాలు, కార్యక్రమాల ద్వారా అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని అన్నారు. దేశంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, భారతదేశాన్ని ప్రపంచ తయారీ రంగ కేంద్రంగా మార్చడం, పెట్టుబడికి అనుకూలావరణ వ్యవస్థను సృష్టించడం, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని నిర్మించడం, పరిశోధనల్ని, అభివృద్ధిని ప్రోత్సహించడం. అధునాతన కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో మార్గదర్శకత్వం చేసే స్థాయికి భారత్ ను తీసుకుపోవడం తదితర లక్ష్యాల సాధన కోసం ప్రధాని శ్రీ నరేంద్రమోదీ దార్శనిక విధానాలను అమలు చేశారని అన్నారు. సముద్ర గర్భాల్లో అన్వేషణ, సముద్ర వాణిజ్య ఆర్థిక వ్యవస్థ, అంతరిక్షం వంటి రంగాలలో కొత్త కార్యక్రమాలను ప్రారంభించారని అన్నారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ఆయా విధానాలను రూపొందించడమే కాకుండా వాటి అమలుకు నిరంతరం కృషి చేశారని శ్రీ అమిత్ షా వివరించారు.

పరిశ్రమలకు, ప్రభుత్వానికి మధ్య పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వారధిగా పని చేస్తోందని కేంద్ర హోంమంత్రి అన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వ విధానాలు, ప్రణాళికలు, దార్శనికతలను పీహెచ్‌డీ ఛాంబర్ అమలు చేయాలని, పరిశ్రమల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. గత పదేళ్లలో మనం చాలా సాధించామని అన్నారు. ప్రధాన రహదారి నిర్మాణంలో భాగంగా ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగమార్గం, ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే వంతెన, ముంబయిలోని ప్రపంచ ప్రఖ్యాత ట్రాన్స్-హార్బర్ లింక్, కోల్‌కతాలో నీటి అడుగున మెట్రో నిర్మాణం వంటి పలు మౌలిక సదుపాయాలను గత 10 సంవత్సరాలలో నిర్మించామని అన్నారు. నీటి అడుగున ఆప్టికల్ ఫైబర్ ఏర్పాటుతో మారుమూల ప్రాంతాలకు కనెక్టివిటీని తీసుకురావడం ద్వారా అండమాన్-నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలో వ్యాపార అవకాశాలు మరింత మెరుగవుతున్నాయని అన్నారు. అంతేకాదు భద్రతా కోణంలో కూడా ఈ ద్వీపాలను బలోపేతం చేసినట్లు చెప్పారు.

చంద్రునిపై శివశక్తి పాయింట్‌లో భారత జెండాను ఎగురవేసినప్పుడు ప్రతి భారతీయుడు ఎంతో గర్వించాడని శ్రీ అమిత్ షా అన్నారు. దేశంలోని అభివృద్ధి చెందని ప్రాంతాలను సాగరమాల ప్రాజెక్ట్ ద్వారా కలుపుతున్నామని అన్నారు. సౌకర్యంగా ప్రయాణం చేయడానికిగాను వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల వ్యవస్థను నిర్మిస్తున్నామని అన్నారు. మన అవసరాలను మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచ అవసరాలను తీర్చడానికి సెమీకండక్టర్ తయారీలో ముందడుగు, ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో నూతన విప్లవం, రికార్డు స్థాయికి ఎఫ్‌డిఐ పెరుగుదల, భారతదేశాన్ని ప్రపంచంలోనే విదేశీ మారకద్రవ్య నిల్వల్లో నాలుగో అతి పెద్ద దేశంగా చేయడం మొదలైనవి తమ ప్రభుత్వ ముఖ్య విజయాలని అన్నారు.

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అంకురసంస్థల ఆర్థిక వ్యవస్థ మనదేనని కేంద్ర హోంమంత్రి అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ చెల్లింపు వ్యవస్థను విజయవంతంగా మొదలుపెట్టింది తమ ప్రభుత్వమేనని, ఇప్పుడు అనేక దేశాలు దీనిని అనుసరిస్తున్నాయని అన్నారు. దీంతో పాటు ప్రధాని శ్రీ మోదీ ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్యం నిల్వ పథకాన్ని సహకార సంఘాల్లో ప్రవేశపెట్టారని తెలిపారు. ఆహార భద్రత నుండి ఆరోగ్య భద్రత వరకు, తమ ప్రభుత్వం అన్ని కోణాలను స్పృశిస్తోందని, రాబోయే 25 సంవత్సరాలలో భారతదేశం అన్ని రంగాలలో అగ్రగామిగా ఉండటానికిగాను గడచిన పదేళ్లలో ప్రధాని శ్రీ మోదీ నాయకత్వంలో పునాది వేసినట్లు శ్రీ అమిత్‌షా స్పష్టం చేశారు. దార్శనికత, అనుభవం, నిబద్ధత కలిసిన వ్యక్తి ప్రధానమంత్రి అయితే దేశానికి ఎంతో మేలు జరుగుతుందని, అందుకు శ్రీ నరేంద్ర మోదీయే అద్భుతమైన ఉదాహరణ అని ఆయన అన్నారు.

ప్రభుత్వాన్ని ఎవరు నడిపించాలో ప్రజలు నిర్ణయించే ప్రజాస్వామ్యం భారతదేశం సొంతమని శ్రీ అమిత్ షా అన్నారు. తులనాత్మక అధ్యయనం లేకుండా, మనం చేసిన పనిని సరైన విధంగా మదింపు చేయలేమని ఆయన అన్నారు. 2014, 2024లో దేశ పరిస్థితిని తులనాత్మకంగా చూడాల్సిన అవసరాన్ని ఆయన ప్రత్యేకంగా తన ప్రసంగంలో ప్రస్తావించారు. 2014కి ముందు భారతదేశం విధానపరమైన జడత్వంతో ఇబ్బందిపడుతూ ఉండేదని, దేశంలో ఎలాంటి విధానాలు రూపొందడంలేదని అందరూ చెప్పుకునేవారన్నారు. కానీ ప్రధాని శ్రీ మోదీ తన పాలనలో ఈ విధాన జడత్వానికి ముగింపు పలికారని అన్నారు. అనేక విధానాలను రూపొందించారని, కార్యదక్షతతో కూడిన రాజకీయాలను తీసుకువచ్చారన్నారు. నేడు శాశ్వత విధానం లేని రంగం అంటూ ఏదీ దేశంలో లేదని శ్రీ అమిత్ షా తెలిపారు. ఇంతకు ముందు, అయిదు బలహీన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశం ఉండేదని, కానీ నేడు భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో ఒక ఆశాదీపంగా ప్రపంచ ద్రవ్యనిధి సంస్థ పేర్కొంటున్నదని అన్నారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి కింద జోజి లా టన్నెల్, చీనాబ్ రైలు వంతెన, అస్సాం వంతెన వంటి ప్రాజెక్టులు నిర్మించామని, అవి అందరికీ స్పష్టంగా కనిపిస్తున్నాయని కేంద్ర హోం, సహకారశాఖల మంత్రి తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇంతకుముందు భారత్‌లో రెండంకెల ద్రవ్యోల్బణం ఉండేదని, నేడు రెండంకెల వృద్ధి దిశగా ఎంతో ఆత్మవిశ్వాసంతో దేశం పయనిస్తోందని అన్నారు. జి20 దేశాలలో భారతదేశ వృద్ధి రేటు చాలా సంవత్సరాలుగా అత్యధికంగా ఉందని అన్నారు. గతంలో ప్రపంచ పెట్టుబడిదారులు భారత్‌పై విశ్వాసం కోల్పోయారని, అయితే నేడు తయారీ రంగంలో పెట్టుబడులకు భారత్ కీలక దేశంగా మారిందని శ్రీ అమిత్‌షా అన్నారు. రికార్డు స్థాయిలో 2021-22లో 85 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) ఆకర్షించినట్లు వివరించారు. నేడు డిజిటల్ చెల్లింపులు వంటి అనేక రంగాల్లో ముందున్నామని అన్నారు. 2014కి ముందు రూ. 12 లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగాయని, అయితే పదేళ్ల శ్రీ మోదీ పాలనలో అవినీతి జరిగిందంటూ ప్రత్యర్థులు కూడా ఆరోపణలు చేయడం లేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర వాదం, బాంబు పేలుళ్లు, నక్సలిజం దేశానికి తీవ్ర సమస్యలుగా మారాయని, అయితే నేడు కాశ్మీర్ కావచ్చు.. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలు కావచ్చు లేదా ఈశాన్య ప్రాంతాలు కావచ్చు. అన్ని చోట్లా తీవ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని విజయవంతంగా నిర్మూలించినట్లు శ్రీ అమిత్ షా తెలిపారు. సులభతర వాణిజ్య ర్యాంకుల్లో గతంలో భారత్ 142వ స్థానంలో ఉండగా, నేడు 63వ స్థానానికి ఎగబాకిందని ఆయన పేర్కొన్నారు. గతంలో మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ బలహీనమైన స్థితిలో ఉండేదని, అయితే 2023-24లో ప్రభుత్వ బ్యాంకులు రూ.1.40 లక్షల కోట్ల లాభాన్ని ఆర్జించాయని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రతి రంగంలోనూ కొత్త విధానాలను ప్రవేశపెట్టామని, తద్వారా దేశం అభివృద్ధి సాధిస్తోందని అన్నారు.

దేశం పురోగమించాలంటే కొత్త విద్యా విధానం తప్పనిసరిగా ఉండాలని శ్రీ అమిత్ షా అన్నారు. అందులో మన వారసత్వాన్ని పొందుపరుస్తూనే విద్యను ప్రపంచీకరణ చేసేలా నూతన విద్యా విధానాన్ని ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ తీసుకొచ్చారని కేంద్ర హోంమంత్రి అన్నారు. జీఎస్టీ, డిజిటల్ ఇండియా, భారతమాల, సాగర్‌మాల, పీఎం గతి శక్తి, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాలు దేశాన్ని అన్ని దిశల్లో ముందుకు నడిపిస్తున్నాయని ఆయన అన్నారు.

ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో "కనీస ప్రభుత్వం, గరిష్ట పాలన" సూత్రం ప్రకారం, 2,000 కాలం చెల్లిన వలసరాజ్యాల చట్టాలను రద్దు చేశాం. వివిధ రంగాలలో 39,000 పైగా నియంత్రణలను తొలగించడం జరిగిందని శ్రీ అమిత్ షా అన్నారు.

# కనకదుర్గమ్మకు వెంకటేశ్వర స్వామి పట్టు వస్త్రాలు

**-తిరుమల తిరుపతి దేవస్థానం తరపున పట్టు వస్త్రాల సమర్పణ..**



తిరుపతి, అక్టోబర్ 11 : దేవ దేవుడు కలియుగ దైవం పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పట్టు వస్త్రాలను కనకదుర్గమ్మ వారికి సాంప్రదాయ బద్ధంగా సమర్పించారు. స్వామి వారి సన్నిధి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం సహాయ కార్య నిర్వహణ అధికారి బి. దొరస్వామి ఆధ్వర్యంలో మహిషాసుర మర్దని అలంకృత కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాలు శుక్రవారం సమర్పించారు. వీరికి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామరావు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఈఓ రామారావు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రం, అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఎస్. కళాబాయి, బిఎస్ ప్రియదర్శిని,బి. భరత్, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి..

వరంగల్, అక్టోబర్ 11 : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని డీసీఎం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గీసుగొండ ఎస్ఐ కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గుల్లపల్లి అఖిల్ 24 తన ద్విచక్ర వాహనంపై పనిమీద వరంగల్ కు వెళ్ళే క్రమంలో వరంగల్ జిల్లా గీసుగొండ మండలలోని 16 వ డివిజన్ గొర్రెకుంట వద్ద అతని వాహనాన్ని డీసీఎం ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది.



దీంతో బైక్ పై వెళ్తున్న అఖిల్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కాగా ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ ఎ.మహేందర్ తెలిపారు. యువకుడు మృతి చెందడంతో ఉప్పరపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## తెలంగాణ కథకులకు సాహిత్య అభిమానులకు విజ్ఞప్తి

బి.ఎస్. రాములుగారు విశాల సాహిత్య అకాడమి తరపున 1998లో 'ఆధునిక కథా సరిత్సాగరం కరీంనగర్ జిల్లా కథలు' మొదటి సంపుటి వెలువరించారు. ఆ స్ఫూర్తితో అనేక జిల్లాల కథా సంకలనాలు వెలువడ్డాయి. వెలువడుతున్నాయి. కరీంనగర్ జిల్లా కథలు 4 సంపుటాలు వెలువడ్డాయి. 2003లో 'భారతీయ సాహిత్యం తెలుగు కథలు' పేరిట అత్యున్నత ప్రమాణాలతో రెగ్జిన్ బైండ్‌తో 18 ఉత్తమ కథలతో మరో సంకలనం వెలువరించడం జరిగింది.

**"బి ఎస్ రాములు విశాల సాహితి కథా పురస్కార గ్రహీతల కథలతో సంకలనం**

విశాల సాహిత్య అకాడమి వివిధ అంశాల గురించిన 195కి పైగా పుస్తకాలతో పాటు, 30కి పైగా కథా సంకలనాలు వెలువరించారు. 1998 నుంచి ఇటీవలి వరకు ప్రతియేటా 'బి ఎస్ రాములు విశాల సాహితీ కథా పురస్కారాలు' ఎంపిక చేసి రచయితలకు బహూకరిస్తూ వస్తున్నారు. ఇటీవలే తన 75వ పుట్టిన రోజు వేడుకను రోజంతా జరిగిన వినూత్న సాహితీ సదస్సు నిర్వహించిన బి ఎస్ రాములు గారు ఇప్పుడు 'బి ఎస్ రాములు విశాల సాహితీ కథా పురస్కార గ్రహీతల కథలు'తో పాటు, మరో 40 కథలు కలిపి 75 కథలతో ఒక తెలంగాణా కథా సంకలనం తీసుకు రావాలని నిర్ణయించారు. ఇవి పావు శతాబ్దం తెలంగాణ కథలకు ప్రతినిధి కథలుగా ఉండాలి.

**పావు శతాబ్దపు తెలంగాణ కథల సంకలనం**

ఇలా తెలంగాణా జన జీవితాన్ని చక్కగా ప్రతిబింబించే, తెలంగాణా కథకుల కథన నైపుణ్యానికి ప్రతినిధిగా నిలువగలిగే కథలు వేయాలన్నది ప్రచురణ కర్తల సంకల్పం. ఈ సంకలనంలో ప్రచురణకోసం, విశాల సాహితీ కథా పురస్కారం పొందిన తెలంగాణా రచయితలు, తాము 2000 - 24 మధ్య రాసిన కథలనుండి ఎంపిక చేయాలని లక్ష్యం. ప్రముఖ సంకలనాల్లో ఇదివరకే వచ్చిన కథలు కాకుండా తమ మిగతా ఉత్తమమైన కథలు సూచించగలరని మనవి. ఒక రచయితది ఒక కథ మాత్రమే తీసుకోవడం జరుగుతుంది. ఈ సంకలనం 2000-24 పాతికేళ్ల తెలంగాణ కథల సంకలనాలు మరిన్ని రావడానికి స్ఫూర్తి నిచ్చే విధంగా ఉండాలని ఆశయం. విశాల సాహితి అవార్డ్ పొందని ఇటీవలి యువ కథకుల కథలు కూడా కొన్ని ఎంపిక చేద్దాం.

**సాహిత్య అభిమానులకు ప్రత్యేక కానుక**

గత 25 ఏండ్లల్ల ఆయా తెలంగాణ రచయితలవి ఉత్తమోత్తమ కథగా మీరు ఏమి ఎన్నిక చేస్తారో చెప్పండి. ఆ కథ సంకలనంకు ఎంపికైతే ఆ సంకలనం మీకు బహుమతిగా ఆ రచయిత చేతులు మీదుగా అందుతుంది.

వాసిరెడ్డి నవీన్, సంగిశెట్టి శ్రీనివాస్, విశాలాంధ్ర, జ్వలిత, కొండపల్లి నిహారిణి, జూకంటి జగన్నాథం, తదితరులు వేసిన కథల సంకనాల్లో, జిల్లా కథా సంకలనాల్లో, వేసిన కథలు వద్దు. ఏ సంకలనంలో చేరని ఉత్తమ కథలు సూచించండి. ఇది వరకే సంకలనాల్లో చేరిన కథలెందుకు? శ్రమ దండగ! ఆయా రచయితలవైనా వేరే ఉత్తమోత్తమ కథలు వేద్దాం!!

యేటా కనీసం 25 మంచి కథలు లెక్కేసుకున్నా గత 25 యేళ్ళలో 625 కథలు మంచి కథలుగా, ఉత్తమ కథలుగా తెలంగాణా నుండి వెలువడ్డాయి. ఇలా వాటన్నిటిని ఒక్కచోట ఒకే సంకలనంలో తీసుకువచ్చే కృషి సాహిత్య సంస్థలు, తెలుగు విశ్వవిద్యాలయం, తెలంగాణ సాహిత్య అకాడమి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ పూనుకోవాలి. ఈ లోపు విశాల సాహిత్య అకాడమి అందుకు ఒక ప్రయత్నం ప్రారంభించింది.

**తెలంగాణ కథకులకు ముఖ్య గమనిక:**

బి ఎస్ రాములు విశాల సాహితి పురస్కారం పొందిన కథకుల ఉత్తమ కథలతో పాటు మరికొన్ని కథలు ఎంపిక చేసి 75 ఉత్తమ కథలతో 25 ఏండ్ల తెలంగాణ ఉత్తమ ప్రాతినిధ్య కథల సంకలనం తేవడం ప్రచురణకర్తల లక్ష్యం.

1. ఇందుకు పంపే కథలు రచయిత ఎందుకు 25 ఏళ్లలో తాను రాసిన ఉత్తమ కథల్లో ఒకటి అని భావిస్తున్నారో కొద్ది వాక్యాలు రాయాలి.
2. గత 25 ఏండ్లలో తాను చదివిన కథల్లో పది ఉత్తమ కథలు పేర్కొని అవి ఎందుకు నచ్చాయి వాటి విశిష్టత సంక్షిప్తంగా పేర్కొనాలి.
3. రచయిత తన పరిచయం, తమ రచనలు సంక్షిప్త బయోడేటా, చిరునామా, ఫోన్ నంబర్, చక్కని లేటెస్టు ఫోటో పంపాలి.
4. నేటి తెలంగాణ కథలు ఎలా ఉంటున్నాయి. ఎలా వస్తున్నాయి, ఎలా రావాలి అని అభిప్రాయం రాయాలి.
5. తెలంగాణ కథల్లో తెలంగాణ భాషే రాస్తున్నామా? రాయలేక పోతున్నామా? కారణాలు, సాధ్యాలు అభిప్రాయాలు రాయాలి.
6. పాఠ్య పుస్తకాలలో తెలంగాణ భాష, తెలంగాణ కథలు నవలలు, ఎంతమేరకు న్నాయి అభిప్రాయం రాయాలి.
7. ఇవన్ని "భారతీయ సాహిత్యం తెలుగు కథలు" పేరుతో విశాల సాహితి 2003 లో ప్రచురించిన సంకలనం సేకరించి ప్రచురించిన విధానమే తప్ప కొత్త ప్రయత్నం కాదు.
8. ఇలా ఈ కథల సంకలనం పావు శతాబ్దం కథల సమీక్ష మూల్యాంకనం చేస్తూ వెలువడుతుంది. సమకాలీన కథకులకు అది మార్గదర్శకంగా ఒక అవగాహన అందిస్తుంది. తెలంగాణ కథ ఎదగడానికి ఉపయోగపడుతుంది. కథలను సూచించేవారు ఆయా రచయితలు, సాహిత్య అభిమానులు ఆ కథలను ప్రచురించిన పత్రిక, పుస్తకం పేరుతోపాటు సంవత్సరం పేర్కొంటూ యూనికోడ్ ఫాంట్‌లోగాని, అను ఫాంట్ ప్రియాంకలో గాని, 15 పాయింట్ అక్షరాలతో ఓపెన్ ఫైల్, పిడిఎఫ్ ఫైల్ పంపాల్సి ఉంటుంది. అలా పంపలేని వాటిని పరిశీలించడం కష్టం.

పై వివరాలతో పాటు 25 ఏండ్ల తెలంగాణ కథలను 2024 అక్టోబర్ నెలాఖరులోగా పంపగలరు. -సంపాదక వర్గం.

విశాల సాహిత్య అకాడమి

వివరాలకు: 8331966987, 9701227207, 948855366, 9490682457, 9505504276, 9949424726, 6305166968. bsramulu@gmail.com



## బెల్లప్పల పెంక

పండుగొచ్చేనని పట్టుబట్టి
పిల్లలు మంది ముఖం జూడరా?
అప్పోసప్పో మనింట్ల మనంజేయాలే
పది దినాల ముందునుంచే కొట్లాడి
పైసలు లేకున్నా పెంక పెట్టేది అమ్మ.

కోపిన్ బియ్యం అడ్డెడు
కమ్మని ఆసన కాటన్ నూనే
సేటు దగ్గర సేరు సెనగపప్పు
కొనలేక ఉద్దెరప్పుతో నాయన.

పొద్దంతా కాయ కష్టం చేసినా!
అలసటనంత చిలక్కొయ్యకు తగలేసి
ఎక్క దీపం గుడ్డి వెలుగు కింద
కట్టెల పొయ్యితో తంటాలు
సెగ పొగలతో కుస్తీలు
కారం పెట్టినట్లు కండ్ల మంటలు
రాత్రంతా పిండి పిసికి బెల్లప్పలు చేసేటోళ్లు.

పెద్ద పేర్పెడు చెవుబిల్లలు
అంబటి గంపెడు ముండ్ల మురుకులు
చిన్న గుల్లెడు కారమప్పలు
మెత్తని పత్తిలాంటి పూరీలు.

లోటా గిలాసల
లొట్టెడు చాయి పోసి
నానేసిన బెల్లప్పలు
బెల్లం కంటే కమ్మగుంటుండే.

గిప్పుడంటే బేకరీ పుడ్డు తిని తిని
బెల్లప్పలు చేద్దైనవి గాని
బెల్లప్పలు ఉంటే
వారం పది దినాలు
పండుగే పండుగ.



–డా.ఎడ్ల కల్లేశ్
9866765126

## ముక్కుపుల్ల



చిన్నప్పటి యాదిని
మనసు సందుగుల
మురిపెంగ దాస్కున్న.

నాకు తొమ్మిదేండ్లప్పుడు
సుక్రారం అంగళ్ళకు తొల్కవోయి
నా ముక్కు కుట్టిచ్చింది మాయమ్మ.

ఎందుకమ్మ ఇప్పుడిది అని నేనంటంటే
ఆడ్విల్లకు ఏ శుభమైన ఇది ఉండాలి బిడ్డ
ఇది పెట్కుంటే శానిగ కన్పిస్తవ్ అని సెప్పింది
ఆ వొయసుల అమ్మ మాట్లు నాకు మన్సుకు వట్టలే.

గిప్పుడిప్పుడే సమజయితుంది
తామరాకు మొకాలల్ల అది ముత్యమైతదని
వనంలోని తంగెడు పువ్వై తదని
గిప్పుడిప్పుడే సమజయితుంది
ముక్కుపుల్ల పిడిలసంది
వొస్తున్నమన ఆరోగ్య సూత్రమని
ముక్కుపుల్లసుంటి మనుసులుంటే
దేశం "పచ్చ తోరణమైతదని"

గిప్పుడిప్పుడే సమజయితుంది
మన సంస్కృతి సంప్రదాయాల తల్లులకు
ముక్కుపుల్ల పట్టం గడ్తదని
దేశంను ఎవరెస్టున నిలవెడ్తదని

గిప్పుడిప్పుడే సమజయితుంది
బతుకు గండదీపం మోస్కుంట
ఆపతుల నేను రాల్సే కన్నీళ్ళను
తన దోసిట్ల పట్టుకొని మలాం రాస్తదని

గిప్పుడిప్పుడే సమజయితుంది
కడ్వీ జిందగీల పెదాల సెట్టుమీద
నగు పూలు పూయిస్తదని
బతుకు దిగూళ్ళల్ల దీపమైతద

గిప్పుడిప్పుడే సమజయితుంది
సిన్నప్పుడు జట్టు గట్టిన ముక్కుపుల్ల
కలెగూర గంపసుంటి జీవితంల
అన్ని రుసులను ఒంపుకొని
కట్టె మంట్ల గల్సిందాక యెంబడే ఉండి
నాతో పాటే కల్సిపోతదని

–కొండాపురం లక్ష్మి
8919285261

## పండుగ ప్రస్తావన:

దసరా హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రుల పదొవరోజు విజయదశమిని దసరా పండుగగా జరుపుకోవడం ఆనవాయితి. ఈ పండుగ ముఖ్యముగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చింది. కొందరు ఈ పండుగకు మొదటి మూడురోజులు పార్వతిదేవికి తరువాత మూడురోజుల లక్ష్మి దేవికి తరువాత మూడురోజులు సరస్వతి దేవికి పూజలు నిర్వహిస్తారు. కొందరు ఈ పండుగ సందర్భంగా బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఆలయాలలో కొలువైయున్న అమ్మవారికి నవరాత్రి తొమ్మిది రోజులు ఒక్కో అలంకారం చేస్తారు. తెలుగు వారు దసరాని పదిరోజులు జరుపుకుంటారు. తెలంగాణాలో ఈ తొమ్మిది రోజులు అమావాస్య నుంచి నవమి వరకు బతుకమ్మను పూజించి ఆటపాటలతో కొలుస్తారు. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణునిపై గెలిచిన సందర్భమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టు పై తమ ఆయుధాలను చేపట్టిన రోజు. ఈ సందర్భమున రావణ వధ, జమ్మి ఆకుల పూజా చేయటం రివాజు. జగన్మాత అయిన దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసునితో 9 రాత్రులు యుద్ధముచేసి వానిని వధించి విజయం పొందిన 10వ రోజు ప్రజలంతా సంతోషముతో దసరా పండగ జరుపుకుంటారు.

## దసరా పురాణాల ప్రాశస్త్యం:

దేవి నవరాత్రుల నేపథ్యం భారత దేశంలోని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలల్లోను చాలా ప్రాముఖ్యతగా జరుపుకునే పండుగ. పురాణేతిహాసాల్లో అనేక కథలు ప్రచారంలో ఉండటం గమనార్హం. దేవీ నవరాత్రుల పరమార్థాలన్నీ ఎంతో ప్రాచీనమైనవి. ఆర్యుల ప్రవేశానికి ముందుకాలంలో, ద్రావిడులలో స్త్రీకి దేవ్యారాధన విస్తృతంగా ఉండేది. వారు తమ వేట, వ్యవసాయానికి, వృత్తులకు దేవతలను కొలిచేవారు. ఈ ఆచారం నేటికీ గ్రామ సీమల్లో దేవతలుగా స్త్రీలనే ఆరాధించడం కనబడు తుంది. ద్రావిడులలో స్త్రీలకు ప్రాధాన్యం ఇచ్చి ఆమె అజమాయిషీలో కుటుంబం నడపబడు తుండేది. నవరాత్రులు సందర్భంగా ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మొదలుకొని నవమి వరకు తొమ్మిదిరోజులు "దేవీని" భక్తి ప్రపత్తులతో ఆరాధిస్తారు. ఈ తొమ్మిదిరోజులకు 'దేవీ' నవరాత్రులు అన్న పేరు ప్రశస్తమై నిలిచింది. ఈ దేవీ నవరాత్రులనే శరన్నవరాత్రులుగా పేర్కొనడం జరిగింది. తొమ్మిదిరోజులు చేసే పూజోత్సవాన్ని వివిధ ప్రాంతాల్లో, దేవీ అమ్మవారిని అనేక పేర్లతో కొలవబడుతుంది. దేవికి తొమ్మిది నామాలలో మూడు రకాలుగా సాత్విక, రాజస, తామస పద్ధతులలో పూజిస్తారు. ఆవిధంగా శ్రీరాముడు రావణునితో యుద్ధం చేసే సందర్భంలో రావణుని సంహారం కష్టతరం కావడంతో ఆ సమయంలో తనకు విజయం సంప్రాప్తిమ్మాలని 'దేవిని' పూజించి నట్లుగా చెబుతారు. ఆ పూజ ఆశ్వీయుజ శుద్ధ ప్రథమ (పాడ్యమి) మొదలుకుని నవమి వరకు తొమ్మిది రోజులు చేసారని పదవ రోజు "దశమి" నాడు రాముడికి రావణ సంహారం జరిగి విజయం లభించిందని పురాణ కథ. మన పురాణాలు పరిశీలిస్తే 'దేవి', మహాకాళీ, మహా మాయగా అవతరించి మధుకైటభులను సంహరించినందున 'మహిషాసుర మర్ధిని', మహా సరస్వతిగా, దేవి ఫాలం నుండి పుట్టినటువంటి చాముండ, సుంభ, నిసుంభులను, రక్త బీజుని వధించిందని, నందుని ఇంట పుట్టిన 'నంద' కంసుడు ఈమెను చంపేందుకు పైకి ఎగుర వేయగా ఆమె నీ ప్రాణాన్ని హరించడానికి నీ ప్రాణ శత్రువు (శ్రీ కృష్ణుడు) నందుడి ఇంట్లో పెరుగుతున్నాడని హెచ్చరించి మాయమవుతుంది. ఇంకా 'రక్తదంతి' అవతారంలో రాక్షసులను చీల్చివేయడం వల్ల ఈ పేరుతొ కొలుస్తారు. 'శాకాంబరీ' ఒకప్పుడు కరువు ఏర్పడగా పూజలందుకున్నది. దుర్గ 'దుర్గముడు' అనే రాక్షసుని సంహరించినందువల్ల దుర్గగా పిలవబడుతోంది 'మాతంగి' అవతారంలో 'అరుణు'డనే రాక్షసుడిని భ్రమరాలు (తుమ్మెదల)



# జగదేకమాత 'దేవి' దుర్గమ్మ

సాయంతో చంపడం వాళ్ళ భ్రమరీ అనే పేరు పొందింది. ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమినాడు కలశ స్థాపన చేసి దేవీ మూర్తిని అందులో ఆవాహనం చేసి, నవరాత్రి వరకు దీక్షతో దేవీ పూజ చేస్తారు. ఆ విధంగానే కాక దేవీమూర్తి పెట్టి తొమ్మిది రోజులు పూజలు జరిపి నిమజ్జనం చేయడం కూడా ఆచారంలో ఉంది. శ్రీ చక్ర పూజ కూడా దేవీ పూజా సందర్భంలో జరుపుతారు. ఈ తొమ్మిది రోజులు కన్యకపూజ, సుమంగళీ పూజ, జపహోమాదులతో విశేష పూజలు జరుపుతారు. మూలానక్షత్రం రోజు సరస్వతి పూజతోనూ, నవమినాడు 'మహా చండీయాగం' జరపటం విశేషం. ఆ సందర్భంగా లోహాభిసారికమంటే రాజల యుగంలో రాజచిహ్నాలను, గజాశ్వాదులను, చాపఖడ్గద్యాయుధాలను పూజించేవారని, ఆ నాటి నుండి ప్రజలంతా ఆయుధ పూజను ఆచారంగా జరుపుకోవడం ఆనవాయితిగా రావడం విశేషం. నవమినాడు దేవీ అమ్మవారిని మహిషాసురమర్ధినిగా కొలుస్తారు.

## మహిషాసురమర్ధిని పరమార్థం :

దైత్యవంశానికి ఆశాదీపంలా జన్మించిన 'మహిషాసురుడు' తన ఆంతరంగిక మిత్రులతో, సచివులతో సమాలోచన చేసి, మరణంలేని జీవనం కోసం మేరుపర్వతశిఖరం చేరి బ్రహ్మదేవుని గూర్చి ఘోరతపస్సు ప్రారంభించాడు. కాలం కదలికలో అనేక వేల సంవత్సరాలు కదిలి వెళ్లిపోయాయి. మహిషాసురుని అచంచల తపస్సుకు సంతసించిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై, 'మహిషాసురా, ఇంక తపస్సు చాలించి ఏ వరం కావాలో కోరుకో' అన్నాడు. 'పితామహా, నేను అమరుణ్ణి కావాలి. నాకు మరణం లేని జీవితాన్ని ప్రసాదించు' అని కోరాడు మహిషాసురుడు. అప్పుడు బ్రహ్మదేవుడు 'మహిషాసురా పుట్టిన ప్రాణి గిట్టక తప్పదు, గిట్టిన ప్రాణి మరల పుట్టక తప్పదు. జననమరణాలు సకలప్రాణికోటికి సహజ ధర్మాలు. మహా సముద్రాలకూ, మహాపర్వతాలకూ కూడా ఏదో ఒక సమయంలో వినాశం తప్పదు. ప్రకృతివిరుద్ధమైన నీ కోరిక తీర్చుట అసంభవం. కనుక, నీ మరణానికి మృత్యువుకు ఒక మార్గం విడిచిపెట్టి, మరేవరమైనా కోరుకో' అన్నాడు. అప్పుడు మహిషాసురుడు 'విధాతా అల్పమైన కోరికలకు ఈ మహిషాసురుడు ఆశపడడు. సరే, ఆడది నా దృష్టిలో అబల. ఆమెవల్ల నాకే ప్రమాదమూ రాదు. కనుక, పురుషుడి చేతిలో నాకు మరణం రాకుండా వరం అనుగ్రహించు' అని కోరాడు. బ్రహ్మదేవుడు ఆ వరాన్ని మహిషాసురునికి అనుగ్రహించి అంతర్ధానమయ్యాడు. బ్రహ్మదేవుని వరాల వలన వరగర్వితుడైన మహిషాసురుడు దేవతల్తో ఘోరమైన యుద్ధము చేసి వారిని ఓడించి ఇంద్రపదవి చేపట్టాడు. దేవేంద్రుడు త్రిమూర్తులతో మొర పెట్టుకొనగా మహిషునిపై వారిలో రగిలిన క్రోధాగ్ని ప్రకాశవంతమైన తేజముగా మారింది. త్రిమూర్తుల తేజము కేంద్రీకృతమై ఒక స్త్రీరూపమై జన్మించింది. శివుని తేజము ముఖముగా, విష్ణు తేజము బాహువులుగా, బ్రహ్మ తేజము పాదములుగా కలిగి మంగళమూర్తిగా అవతరించిన ఆమె 18 బాహువులను కలిగి ఉంది. ఆమెకు శివుడు శూలమును, విష్ణువు చక్రమును, ఇంద్రుడు వజ్రాయుధమును, వరుణ దేవుడు పాశము, బ్రహ్మదేవుడు అక్షమాల, కమండలము హిమవంతుడు సింహమును వాహనంగాను ఇచ్చారు. ఇలా సర్వదేవతల ఆయుధములు సమకూర్చుకొని మహిషాసురుని సైన్యంతో తలపడి భీకరమైన పోరు సల్పింది. మహిషాసురుని తరఫున పోరు సల్పుతున్న ఉదగ్రుడు, మహాహనుడు, అసిలోముడు, బాష్కలుడు, బిడాలుడు మొదలైన వారిని సంహరించిన తరువాత మహిషాసురునితో తలపడినది. ఈ యుద్ధములో ఆదేవి వాహనమైన సింహమూ శత్రువులను చీల్చి చెండాడింది. దేవితో తలపడిన అసురుడు మహిషరూపము, సింహరూపము, మానవరూపముతో భీకరముగా పోరి చివరకు తిరిగి మహిషరూపములో దేవిచేతిలో హతుడైనాడు. ఈ విధంగా అప్పటి నుండి మహిషుని సంహరించిన దినము దసరా పర్వదినంగా ప్రజలచే కొనియాడబడింది. ప్రజలంతా విజయదశమి నాడు ఆనందంతో జరుపుకునే పండుగే దసరా. ఈ పండుగకు పురాణాలలో అనేకానేక కథలు ప్రచారంలో ఉండటం గమనార్హం. అవేమిటో తెలుసుకుందాం.

## రాజరిక వ్యవస్థలో దేవి ఉపాసన :

మహా భారతంలో కూడా దేవీ ప్రసక్తి రెండు పర్యాయాలు వచ్చింది. పాండవులు విరాటరాజు కొలువుకు వెళ్లబోయే ముందు, యుధిష్ఠరుడు 'దుర్గను' ప్రార్థించడం మొదటిది. కురుక్షేత్రం నందు కృష్ణుని సలహాపై అర్జునుడు చేసిన 'దుర్గాస్తుతి' రెండవది. ఈ విధంగా భారత, రామాయణ గ్రంధాలలో దేవి ప్రసక్తి ఆ దేవికి ఉన్న ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. మన పురాణాల్లో లక్ష్మి, పార్వతి,సరస్వతి వీరు ముగ్గురు 'శక్తి' స్వరూపిణికి మూడు అంశలు అని పేర్కొనడం జరిగింది. అలాగే లక్ష్మి, సరస్వతులు వీరిద్దరూ 'దుర్గ దేవి' అంశ గలవారని వారిద్దరిని పూజించినచో దుర్గా దేవిని పూజించిన ఫలితం దక్కుతుందని చెప్పబడింది. "కేనోపనిషత్తులో" దుర్గా దేవిని ఈ విధంగా వర్ణించారు. ఆమె ఒక కాంతి పుంజం వంటిదని, జగత్తునకు వెలుగును ఇచ్చే ఆ సూర్యభగవానునే ప్రకాశింప జేయునది ఆమెయేనని, వాయుదేవతని, సమస్త ప్రాణి అన్ని దుర్గామాతయే "సర్వం శక్తిమయం" అనడంలో సందేహం లేదు. సృష్టికంతయు మూలాధారమైన శక్తి స్వరూపమే, పలు విధాలుగా శక్తిమూర్తులై పూజలందుతున్నట్లు, తూర్పు చాళుక్యులు కాలంలో 'కూష్మాండినీ' దేవిగా పూజింపబడింది. కందుకూరి చోడుల కాలంలో ప్రజలు మహిషాసుర మర్ధిని, బ్రహ్మి, మహేశ్వరీ, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండి, సరస్వతిదేవి మొదలైన స్త్రీ దేవతలను పూజించారు. శైవం ఆనాడు ప్రబలంగా ఉండేవి. చాళుక్యులు, చోళులు, పల్లవులు వీళ్లంతా వీర శైవమతాను యాయులు. జంతు బలులు కూడా వీరి కాలంలో ప్రబలంగా ఉండేవి.

కాకతీయుల కాలంలో ఏకవీర, రేణుక, చమడేశ్వరి మొదలగు దేవతలు పూజలందు కున్నారు. వీరి కాలంలో దుర్గాష్టమి పూజలు విశేషంగా వైభవోపేతంగా జరుపబడేవి. గౌరీ, కాకతీ, పద్మాక్షి, కూష్మాండిని పూజలు జరిగేవి. ఆశ్వీయుజ అమావాస్య నుండి అష్టమి వరకు దేవీ పూజలు జరిగేవి. దశమినాడు దసరా పండుగ జరిగేది. ఈ కాలంలో గౌరీ, లక్ష్మి, పార్వతులకు ప్రతిరూపంగా "బతుకమ్మ" పండుగను స్త్రీలు ఆచరించేవారని, పూలబతుకమ్మను దేవతగా, శక్తి స్వరూపిణిగా భావించి పూజించేవారని తెలుస్తుంది. రేణుకాదేవి 'ఎల్లమ్మ' దేవతగా పూజలందు కుంటుంది. కర్ణాటక రాష్ట్రంలో ఈ పండుగను రేచర్ల పద్మ నాయకుల కాలంలో వైష్ణవం, శైవం కూడా ఉండేవి. వీరి కాలంలో కాళికాదేవి, దుర్గాదేవి, చండి, భద్రకాళి, మహిషాసురమర్ధని పూజలు వ్యాప్తిలోకి వచ్చాయి. తెలంగాణ రాష్ట్రంలో గ్రామ దేవతలు కట్ట మైసమ్మ, రేణుకమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ మొదలైన వారు ఉండేవారు. రెడ్డి రాజుల కాలంలో కూడా శక్తి పూజలు వ్యాప్తిలోకి వచ్చాయి. పార్వతీదేవి, భద్రకాళి, దుర్గ, చండి, కాళికా రూపాలలో దేవి పూజలందుకుంది. క్రీడాభిరా మంలో పరశు రాముని తల్లి జమదగ్ని భార్య అయిన రేణుకాదేవిని, ఏకవీరా దేవిగా పూజించేవారని, ఆమె పార్వతివలె, ఆదిశక్తి అఖిల వేద వేదాంతసారమని చెప్ప బడింది. ఆమె కోపించిన సామ్రాజ్యాలు క్షణంలో నాశనమగు తాయని అనుకోవడం గమనార్హం. శక్తి పూజ తాంత్రిక విధానంతో సంబంధించినది. ఆంధ్ర రాష్ట్రంలోని విజయనగరంలో నవరాత్రి ఉత్సవాలు చూడడానికి దేశవిదేశాల నుండి ఎంతోమంది యాత్రికులు విజయనగరానికి వచ్చేవారని, ఆ తొమ్మిది రోజులు చక్రవర్తి విజయ మంటపానికి ఉదయమే వచ్చి దుర్గపూజ చేసేవారట. ఆ పూజపుష్పాలు తన ప్రీతి పాత్రములైన గుర్రాలు, ఏనుగుల మీద చల్లి, తర్వాత దుర్గా దేవికి నివేదించిన ప్రసాదాలను స్వీకరించేవారని 'నన్నిజూ' తన చారిత్రక గ్రంథంలో పేర్కొన్నాడు. ఆ విధంగా దేవి ఆరాధన అనాదిగా ఉందని తెలుస్తున్నది. అదిమానవుడి కాలం నుంచే ప్రారంభంమైన దేవీ ఉపాసన ఈ నాటికీ కొనసాగుతూనే ఉంది. దేవి "స్త్రీ శక్తికి" ప్రతిరూపంగా నిలిచి పూజలు అందుకుంటుంది.

## ఇంద్రకీలాద్రిపై అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకి బెజవాడ కనకదుర్గమ్మ:

దక్షిణ భారత దేశంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమై కృత యుగం నాటి కోవెల బెజవాడ దుర్గమ్మ కొలువుండే ప్రధానాలయం బంగారు గోపురంతో ఉంటుంది. శ్రీ చక్ర అధిష్టాన దేవత, పరమ పవిత్రమైన ఇంద్రకీలాద్రి మీద ఇంద్రాది దేవతల కోరిక మీద దుర్గాదేవి మహిషాసురమర్దని స్వరూపంతో స్వయంభూగా వెలసి కోరిన వారికీ కొంగు బంగారమై "బెజవాడ దుర్గమ్మ"గా కీర్తి పొందుతున్నది.

## కనకదుర్గ క్షేత్రంలో దర్శనీయ స్థలాలు :

అమ్మవారి ఆలయానికి ఉత్తర భాగంలో వున్న అత్యంత ప్రాచీనమైన ఆలయం మల్లేశ్వరస్వామి వారి ఆలయం అమ్మవారి భర్త అయిన పరమేశ్వరుడుగా వెలిసిన ఈ పవిత్రమైన ఆలయంలో అమ్మవారిని దర్శించిన ప్రతి ఒక్కరు విధిగా మల్లేశ్వర స్వామివారిని తప్పకుండా దర్శించాలి. క్షేత్రపాలక అంజనేయస్వామి, నాగేంద్రుడి పుట్ట, విఘ్నేశ్వరుడు, నటరాజస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరాలయం, పార్వతిపరమేశ్వరుల కళ్యాణం జరిపే మంటపం ఉంటుంది. ఈ దసరా ఉత్సవాల్లో దేశం నలుమూలల నుండి దుర్గమ్మని దర్శించుకోవాలని తపన పడతారు. లోక కంటకుడైన దుర్గమాసురుడి సంహారానంతరం ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గమ్మ మహారౌద్రంగా ఉండేదట. అటువంటి రౌద్ర స్వరూపిణిని పరమశాంతి స్వరూపిణిగా మార్చాలనే సంకల్పంతో శ్రీ జగద్గురు అది శంకరాచార్యులవారు ఇక్కడికి వచ్చి అమ్మవారి సన్నిధిలో శ్రీ చక్ర యంత్రాన్ని స్వయంగా ప్రతిష్టించారు. అంతే ఆనాటి నుండి దుర్గమ్మ భక్తులకు శాంతి స్వరూపిణిగా మారి దర్శనమిస్తుంది.

శ్రీ చక్ర రాజ నిలయా శ్రీ మత్రిపుర సుందరీ
శ్రీ శివా శివ శక్త్యైక స్వరూపిణి లలితాంబికా

అని లలితా సహస్రనామ స్తోత్రంలో చెప్పినట్లుగా సృష్టి స్థితి లయ కారిణి అయిన ఆదిశక్తి దుర్గమ్మ పవిత్రమైన లలితా స్వరూపిణీగా నిత్యం లలితా సహస్రనామాలతోనే అర్చించటం జరుగుతోంది. దసరా దుర్గమ్మ దర్శనం శుభకరం. స్త్రీల పసుపు కుంకుమలతో కలకాలం వర్ధిల్లెందుకు, సౌభాగ్యానికి నిత్యం లలితా సహస్రనామ స్తోత్రపారాయణం చేయడం శుభం. అందరికీ విజయదశమి శుభాకాంక్షలు.

సర్వే జనాః సుఖినో భవంతు.



–శారద శృంగేరి
9490 26 1119



## విజయ దశమి

శ్రవణ నక్షత్రంతో కూడి
అశ్వయుజదశమికి
విజయ అను సంకేతంతో
వచ్చిందే విజయదశమి.

ఏ ముహూర్తం చూడక
ఈనాడు ఏ పని తలపెట్టిన
కలుగును విజయం అనేది
ఈపండగ విశేషం-ప్రాధాన్యం.

దుర్గా దేవుని భక్తితో
తొమ్మిది రోజులు శ్రద్ధగ
నవరాత్రులపేరిట వేడుకగ
చేయురు అంతా పూజలు.

పాలపిట్ట దర్శనం
జమ్మిచెట్టు ప్రదక్షిణం
అలాయ్ బలాయ్ లతో
స్నేహం బంధాలను
కలుపుకపోతారు.

దుర్గ భవానికి ప్రణామం
పెద్దల దీవెన ఆశీర్వాదం
దశమి నాటి సంబరం
అందరికికలగాలి ఆనందం.



–ఎన్.రాజేష్
9849335757

## మహాశక్తి రూపాలు



పుట్టుకతోనే పసి నవ్వులు దాచి..
కాళ్ళ మట్టెలతో కదలికల్ని కుదించి..
పసుపు తాడుతో స్వేచ్ఛను హరించి..

గృహిణి పాత్రలో ఒదిగింది మగువ !
గృహమే కదా స్వర్గసీమంటూ..
ఇల్లే తన అనంత లోకమంటూ..
తనను తానే త్యాగం చేసుంటూ..
బంధాల బంధనాల్లో చిక్కింది స్త్రీ !.

సృష్టికి ప్రతి సృష్టికే కదా..
ఆడ జన్మ అర్థం పరమార్థమని..
సహనమే సతికి పర్యాయపదమని..
శాంతి సంపదే ఆమె సొంతమైంది !.

అతివ అన్నామృత వర్శిణి..
ఆమె హస్తమే అక్షయపాత్ర..
మగువేగా మర్యాదల పొదుగు..
ఇల్లాలే కదా ఇంటి దేదీప్య దీపం !.

ఆమె మనసే అనంత సాగరం
అమ్మతనమే అత్యద్భుత వరం
ఆవిడ స్పర్శయే అపూర్వ లేపనం
శారదలా సకల విద్యల సమ్మిళితం !.

ఆమె జననం అనివార్య అవసరం
ఆమె ఒడి ఆది గురువు నిలయం
ఆమె మది కష్టసుఖాల మందిరం
ఆమె లక్ష్యమే కుటుంబ సంతోషం !.

స్త్రీయే కదా ఆర్థికశాఖ మంత్రిణి
జ్వరాలకే దడ పుట్టించే వైద్యురాలు
ఆమే కదా సకల విద్యల తావు రేవు
అశ్రువుల్నే అధిగమించగల అర్ధాంగి !.

మగని మనసెరిగిన మేధావి
పిల్లల ఆకలి వినగల వివేకి
ఇంటినే కోవెలగా మార్చే జ్ఞాని
ప్రకృతి ప్రసాద వరమేగా పడతి !.

ఆమెలో ఆది మహాశక్తిని చూద్దాం
అతివలో అమ్మను చూసి తరిద్దాం
చిన్నారిలో చెల్లిని తలచి మురుద్దాం
మహిళలో మహిమగల
దుర్గను దర్శిద్దాం !



–మధుపాళీ
9949700037








## తెలంగాణ సంస్కృతి బతుకమ్మ

తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు రోజుకో తీరున బతుకమ్మను పూలతో పేరుస్తూ జరిపే పండుగ వేల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పండుగ వెనుక కూడా అనేక కథలు ఉన్నవి. చోళ రాజు అయిన ధర్మంగదునికి 100 మంది కుమారులు పుడతారు. వారందరూ యుద్ధంలో మరణిస్తారు. వారికి చాలా కాలం తర్వాత లక్ష్మీదేవి అనుగ్రహంతో వారికి ఆడపిల్ల పుడుతుంది. పుట్టక పుట్టక పుట్టిన పిల్లకు బతుకమ్మ అని పేరు పెట్టి నూరేళ్లు బతకాలని ఆశీర్వదిస్తారు. ఆ అమ్మాయే బతుకమ్మ గా పూజలు అందుకున్నది. గునుగు, చామంతి, తంగేడు, తోక చామంతి, ఎర్రగన్నేరు, గడ్డి పువ్వు, బంతి ముద్దబంతి, రకరకాల పువ్వులను సేకరించి బతుకమ్మను పేరుస్తారు. బతుకమ్మ పైన పసుపు ముద్దను నిలిపి గౌరీ దేవిగా పూజలు చేస్తారు. బతుకమ్మ ప్రకృతితో ముడిపడిన పండుగ. పువ్వులను పూజించే సంస్కృతి తెలంగాణకే దక్కింది. తొమ్మిది రోజులు తొమ్మిది పేర్లతో బతుకమ్మను కొలిచేదరు. మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ అని పిలుస్తారు. ఆరోజు నువ్వులు బెల్లం చక్కెర నైవేద్యంగా పెడతారు. రెండవ రోజు అటుకుల బతుకమ్మ ఆరోజు పప్పు బెల్లం అటుకులు ప్రసాదం చేస్తారు. మూడవరోజు ముద్దపప్పు బతుకమ్మ గా పిలుస్తారు. ముద్దపప్పు బెల్లం ప్రసాదంగా చేస్తారు. నాలుగవ రోజు నానే బియ్యం బతుకమ్మ, ఐదవ రోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలకల బతుకమ్మ, ఆరో రోజును ( అర్రేమి అంటారు ) ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజు వెన్నెముద్దల బతుకమ్మగా పిలుస్తారు. 9వ రోజున సద్దుల బతుకమ్మగా పిలుస్తారు. బతుకమ్మ పండుగ ఏ వాడకు ఆ వాడవాళ్ళు వాళ్ల వాకిళ్లలో గ్రామంలో కీలక ప్రదేశంలోనూ బతుకమ్మలను పెట్టి చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ ఆడుకుంటారు. బతుకమ్మ ఆటలు ఒక ప్రత్యేకత ఉన్నది. ఓ పద్ధతి ప్రకారం అడుగులు వేస్తూ చప్పట్లు కొడుతూ గుండ్రంగా తిరుగుతూ ఆటపాటలతో బతుకమ్మ ఆటలు ఆడుతూ ఉంటారు. బతుకమ్మ పాటలో గొప్ప సాహిత్యం ఇమిడి ఉంటుంది. బతుకమ్మ పాటలు ఎంతో ప్రసిద్ధిగాంచినవి ఆయా ప్రాంతాల ఆచారాలు పేర్లు అలవాట్లు భాషను కలుపుకొని ప్రాంతీయ కథలతో ఉయ్యాలో గౌరమ్మ అని వలలో అని వెన్నెలలో మాటలను చివరన చేరుస్తూ పాటలు పాడుతారు. సద్దుల బతుకమ్మ దసరాకు ఒకటి రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మను జరుపుకుంటారు. సద్దుల బతుకమ్మ రోజు కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే ఉంటారు. బతుకమ్మను పెద్దగా పేర్చుకుంటూ పండుగకు ఆడపడుచులు కొత్త బట్టలు ధరిస్తారు. సద్దుల బతుకమ్మ రోజు గ్రామంలో ఉండే ప్రధాన ప్రదేశం దగ్గర బతుకమ్మలను పెట్టి అందరూ ఆడుతారు. బతుకమ్మ ఆడిన తర్వాత బతుకమ్మని ఎత్తుకొని సద్దులు తీసుకొని ఆడుకున్న తర్వాత చెరువుకు దగ్గరికి వెళ్తారు. జొన్న పిండి మక్కా పిండి బెల్లం పెసరపిండి నెయ్యితో చేసిన మలీల సత్తుపిండి దోసకాయ పెసరపప్పు బెల్లం తో సద్దులను తయారు చేస్తారు. చెరువు దగ్గర బతుకమ్మను దించి మరొకసారి ఆడుకొని చెరువులో సాగనంపుతారు. పాటలు పాడుకుంటూ చెరువుల నిమజ్జనం చేస్తారు. తర్వాత తెచ్చిన సద్దులను ఒకరికొకరు పంచుకుంటారు. బతుకమ్మనీళ్ళలో వదలను కూడా ఒక పద్ధతి ప్రకారం చేస్తారు. మోకాలి లోతు నీటి వరకు వెళ్లి నీటిపై బతుకమ్మ నుంచి ఏమాత్రం బతుకమ్మ చెదరకుండా. ఓడుపుగా వదిలి ఇత్తడి తాంబూలాన్ని పక్కకు తప్పిస్తారు. తిరిగి వస్తారు. తెలంగాణ ఉద్యమంలో కూడా బతుకమ్మ ప్రస్తావన ఆటపాటలతో ఉద్యమం జరిగింది. బతుకమ్మ ఆటపాటలతో స్త్రీలను భాగస్వామ్యం చేసింది.

అందరినీ ఒకటి చేసే బంగారు బతుకమ్మ పండుగ.



–దేవులపల్లి రమేశ్
9963701294

## మా ఊరి బతుకమ్మ పండుగ

బాద్రపద అమవాస్య నుండి
బతుకమ్మపండుగ
ఆశ్వయుజ అష్టమి దాకా
తొమ్మిది రోజులు పూల పండుగ
పెండ్లైన ఆడపిల్లలంతా తల్లిగారిండ్లకు చేరిక.
దుర్గాష్టమి రోజు సద్దుల బతుకమ్మ
అడవికి వెళ్ళేరు తంగేడు పూలకై
చిట్టీ చేమంతులు గడ్డిపూలు తెచ్చి
గుడ్డం కాడికెళ్ళి గునుక పూలు తెచ్చి
పేరట్ల నుండి పెద్ద గుమ్మడి పూలూ
కడుపూ నింపుటకూ బీర ఆకులు తెచ్చి
పట్టుకుచ్చుల పూలూ పరగ దెచ్చేరూ
ఇంటిల్లిపాదీ కొత్త సాపల కూర్చోనీ
తాంబాలంలో పెద్ద బతుకమ్మను పేర్చి
ఇత్తడి తప్కు లోచిన్న బత్కమ్మ
గుమ్మడి పువ్వులో గౌరమ్మ కొలువు.
అమ్మ చేసిన మలీద ముద్దలు
పెసరు, పల్లీలు చక్కెరల సత్తు పిండి
పులిహోర అన్నం సద్ది గిన్నెలల్ల సర్ది
ఇంట్లో స్త్రీలంత చక్కంగ తయారు
రెండు బతుకమ్మలకు ధూప దీప
నైవేద్యాలు పెట్టి మదిలోన మొక్కులు
కోర్కెలు తీర్చమని కోరికల చిట్టాలు.

ఇంటి వాకిట్ల బతుకమ్మలు పెట్టీ
రామ రామ రామ ఉయ్యాలో
రామనే శ్రీరామఉయ్యాలో
రామ రామానంది ఉయ్యాలో
రాగమెత్తరాదు ఉయ్యాలో అంటూ
లయబద్ధంగా కొంచెం సేపు బతుకమ్మ ఆట.
వాడకట్టు కాడ పెద్ద జాగ జూసి
అందరొక్క కాడ ఆడి పాడుతరు
ఆట పాటల తోటి చప్పట్ల తాళం
భక్తితో చేసేటి చరణాల నాట్యం.

పెద్దమనుషులంతా సప్పుడుతొ రాగ
బతుకమ్మలను ఎత్తి బైలెల్లుతారు
చెరువు కాడికి చేరీ బతుకమ్మలాను
ఖాళీజాగల పెట్టి ఊరందరి ఆట
పురోహితుడు వచ్చి పూజ చేస్తాడు
చెరువులో వేయుటకు సిద్ధమౌతారు.

నీళ్ళలోన వదలి పాటందుకుంటరు
పోయిరా బతుకమ్మపోయిరావమ్మా
మల్లొచ్చె పండుగకు మల్ల రావమ్మ
సాగనంపినాక స్త్రీమూర్తులంత
గౌరమ్మ పసుపు గదువలకు పూసుకొని
వాయనాలను ఇచ్చి పుచ్చుకుంటారు
గౌరమ్మ పాట మధురంగ పాడుకుంటారు.

తెచ్చినా సద్దులను పంచుకుంటారు
చిననాటి మిత్రులను కలుసుకుంటారు
ఆనంద ఘడియలను ఆస్వాదిస్తరు
సంతసంగా పాట గొంతెత్తి పాడుతూ
ఆనందముతో ఇంటి బాట పడతారు.

బతుకమ్మ తెలంగాణ సంప్రదాయ పర్వం
బతుకమ్మ తెలంగాణ మదినిండ గర్వం.



–గిరిమాజి దామోదర్
919966336960

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.